బంజారా నానీ

తండాలో నా గుండె
నా గుండెలో తండా
బాల్య స్మృతుల
కలకండ



-డా॥ సూర్యాధనంజయ్
సెల్:9849104187




# నేటి నిజం సాహితీ కెరటాలు

website:www.netinijam.com website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 3-8-2023


## ఘంటారావం

సాకులు చెప్పడానికి
సాధన చేయకు
పనిలో ప్రావీణ్యం
పొందాలని మరువకు.

కొనుక్కున్న కీర్తి
ఎంత వరకు?
వేసిన దండ
వాడేవరకు

ఎన్ని కన్నీళ్ళు కార్చాక
ఈ మొలకనవ్వు మెరిసింది
ఎన్ని చినుకులు కురిశాక
ఈ మొలక మొలిచింది.

అప్రధాన ఆలోచనలతో
మెదడును వేధించకు
హృదయనాదాలకు
అవరోధం కలిగించకు



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

పుస్తక సమీక్ష

# విభిన్న భావాల సమాహారమే "హిప్నలిపి" దీర్ఘకవిత






వర్తమాన కవిత్వానికి కావల్సింది సామాజికస్పృహ. **అది ఏ రూపంలో ఉంటేనేం కాలం వెంట వయసు పరుగులు తీస్తుంటే అనుభవాలు కొత్త ఊటలతో మనసు లోతుల్లోకి ప్రవహిస్తాయి.** వాటిని సాంద్రతతో ఒడిసిపట్టుకుని గాఢంగా పెనవేసుకుంటే ఆ మౌన చైతన్యమే వేరు. అలల తాకిడికి మెరిసే నీటి బిందువుల్లా స్వచ్ఛత ఉట్టిపడుతుంది. నిర్మలత్వం, నిశ్చలత్వం కలగలిపిన వాక్య నిర్మాణమై మానవ జీవితంగా పరిమళిస్తుంది. ఇందులో దారులు వేరైనా భావాల ప్రకంపనలు ఒక్కటే. వీటిలో తాత్విక చింతన మాటున ఊగిసలాడే దృశ్యాలు ఎన్నెన్నో. అలాంటి భావాల సమాహార కలబోతే ఈ "హిప్నలిపి" దీర్ఘకవిత.

దీనికి ఎల్లల్లేవు. అనుభూతుల ప్రవాహ తీవ్రతలో నిరంతరం ఊగిసలాడుతూ ఊహల్లోంచి జీవన వాస్తవికతలోకి తొంగి చూడటమే సహజ మానవ నైజం. దీనికి వయసు రీత్యా కొంత మినహాయింపు తో కొనసాగడం ఒక ధార్మిక సత్యం. అందులోనూ వయసు మళ్ళిన వ్యక్తి సాంప్రదాయకత్వంలోంచి ఆధునికత్వంలోకి తొంగి చూడటం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇలాంటి అనుభవాలను తర్కబద్ధంగా తడిమిన కవి యు.వి.రత్నంగారు. నిజంగా ఇవి మేలురత్నాలే. ఈ సృజనరేఖల వాక్య విన్యాసాల్ని వారి కవిత్వ రూపంలో ఇప్పుడు ఒడిసిపట్టుకునే ప్రయత్నం చేద్దాం.

**"గగన వీధిలో మబ్బుల మాటున**
**నక్షత్రాల కిందుగా శూన్యం**
**ఆకాశంలో పున్నమి చంద్రుని వెలుగులో**
**నల్లమబ్బుల చాటున పరుగిడే చీకటి**
**మల్లె పందిరి కింద**
**ఒంటరిగా నభోవీధి లోనికి**
**దృష్టి"**అంటూ ధ్వని తీవ్రత లోంచి ఆవేదనల్ని మూటగట్టి భావుకతలో నిర్లిప్తంగా పడివున్న దృశ్యాల్ని కళ్ల ముందు దృశ్యమానం చేస్తారు కవి రత్నంగారు. వీటిలో పైకి నిర్మలత్వం కనిపించినా లోలోపల ప్రస్ఫుటించే విరుద్ధ సంఘర్షణల అంతర్గత రూపం చాపకింద నీరులా ప్రవహించే తాత్విక కోణాల్నే మాటల చూపుల్తో ప్రశ్నిస్తాయి. ' గగన వీధిలో మబ్బుల మాటున అంటూనే.. నక్షత్రాల కిందుగా శూన్యం ' అనడంలోనే ఒకరకమైన మిధ్యాభావాన్ని తర్కబద్ధంగా విశ్లేషించే ప్రయత్నం చేస్తారు. **'పున్నమి చంద్రుని వెలుగులో/నల్లమబ్బుల చాటున పరుగిడే చీకటి ' అని నొక్కి చెప్పడంలో వెలుతుర్లో కనిపించని చీకటిని వెదికి పట్టి మరీ 'మల్లె పందిరి కింద/ఒంటరిగా నభోవీధి లోనికి'** తన దృష్టిని సారిస్తారు. ఈ వెదుకులాటలో అన్వేషించే అంతర్ముఖీ నమైన సూక్ష్మదృష్టి ఇక్కడ అడుగడుగునా వయసు పరిణతిని తెలియజేస్తుంది.

ఇంకోచోట ఇలా అంటారు.

**" కార్తీక మాసపు పౌర్ణమి వెలుగు**
**చల్లని ఇసుక తిన్నెల పైన**
**వెన్నెల కురుస్తుంటుంది"** అని సానుకూల దృక్పథంతో చెబుతూనే...

**"గుళ్ళకమ్మ నది ఒడ్డున**
**నల్లని నీలినీడలు అస్పష్టంగా**
**దొరుకుతావని చెంతకు పరుగెత్తాను**
**సేదతీరే జ్ఞాపకం ఊరిస్తున్నది**
**వెతుకుతూనే వున్నా**
**బతుకు తిరునాళ్ళలో**
**రథోత్సవం టెంకాయ తాటిమోకు**
**కింద నలిగిపోతున్నాను"** అనే అంతర్మథనంలో కవి మానసికమైన ప్రతికూల దృష్టితో లోచూపుగా సంఘర్షించడం ఈ జీవన వెతుకులాటలో ఒక నిత్య భాగమే. ఇందులో ఏదీ యాదృచ్ఛికం కాదు. అన్నీ సహజ పరిణామ సంకేతాలే. వీటిలో మార్మికంగా దాగిన మౌన సంభాషణ ధ్వనిని అర్థం చేసుకుంటే ఈ కవి రత్నంగారి మూగ రోదన గుండె చప్పుడు మనకి వినిపిస్తుంది.

మనిషిలో భావాలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. కొన్నిసార్లు భావోద్వేగంతో ఊగిసలాడుతుంటాయి. అలాంటి తరుణంలో లోలోపలి దాచుకున్న భావ ప్రకంపనలు ఉప్పెనలా పొంగి వచ్చి ఊహలతో సంఘర్షించి సంభాషించి వాస్తవాన్ని నిగ్గు తేలుస్తాయి. ఈ తపనలోంచే కొన్ని అనుభవపూర్వక సత్యాలు ఈ భౌతిక ప్రపంచం వాస్తవిక స్థితిగతుల్ని అక్షరం సాక్షిగా తేటతెల్ల పరుస్తాయి.

**"అస్తిత్వ నాస్తికత్వాలు**
**సమానాంతర రేఖలు**
**కలవని ఆలోచనల**
**ఉదయాస్తమయాలు"** అంటూ వ్యక్తీకరిస్తూనే...

**"పుట్టిన ఆలోచన**
**పెరిగి**
**శాఖా సంక్రమణంలో**
**తిరుగాడి తిరుగాడి**
**క్షితిజ రేఖలో**
**లీనమౌతుంటాయి"** అన్నప్పుడు ఒకే రకమైన ఏకీకృత భావనలో శబ్ద చలనం చేస్తాయి. రెండు విరుద్ధ భావనల మధ్య పొసగని అభిప్రాయ కోణాలు ఒకే ఒరలో ఒదగని రెండు కత్తుల్లా పరస్పర విముఖతను ప్రదర్శిస్తాయి. 'అస్తిక నాస్తికత్వాల'నేవి ఏకమవ్వని 'ఉదయాస్తమయాల'తో కవి పోల్చి చెప్పడం అంతుర్ముఖంగా దాగివున్న భావ వైరుధ్యాల్ని బహిరంగ పరుస్తూ నిజాల్ని తవ్వి వెలికితీసే ప్రయత్నం చెయ్యడమే. ఈ ఆలోచనల బీజాలు చివరికి 'శాఖా సంక్రమణం' లో తిరుగాడి 'క్షితిజ రేఖలో లీనమవ్వడం' బహుముఖ తాత్విక పార్శ్వాలను ఒకేచోట ఏకం చేసే విలక్షణమైన దృష్టి ప్రక్రియ. ఈ సముదాయం లోంచే సమాధానం పుట్టుకొస్తుంది. ఇది ఈ కవి సునిశిత పరిశీలనా దృష్టికి, లోతైన గాధ అధ్యయనానికి ఒక ప్రతీక.

మరోచోట రత్నంగారి మాటల్లో చెప్పాలంటే...

**"నీ చిరునవ్వుల మురళీనాదపు వెన్నెల**
**మాయ జలతారుల**
**నీ పాద మంజీరాల నిశ్శబ్దపు శబ్దం**
**నా వీనులలో వినిపిస్తున్నది"** అనడంలో గాధ మమేకత్వంలోని శ్రవణ పులకరింతని తాదాత్మ్య దృష్టితో ఒక పలవరింతగా కలవరించడలో అంతర్లీన మార్మిక తను ధ్వనిస్తోంది.

'చిరునవ్వుల మురళీ నాదపు వెన్నెల'ను 'పాద మంజీరాల నిశ్శబ్దపు శబ్దం'గా పోల్చి చెబుతూనే 'మాయ జలతారుల' పద ప్రయోగం తో ఒత్తి పలికించడం చెయ్యి తిరిగిన అనుభవ సాంద్రతకు గీటు రాయిగా పేర్కొనవచ్చు.

ఈ క్రమంలోనే సామాజిక వ్యవస్థీకృత దృష్టి కోణంలో ఆలోచించినప్పుడు మనసును కలచివేసే పాక్షిక సజీవ జీవన దృశ్యాలు కొన్నిసార్లు తిరుగుబాటు ధోరణిలోంచి మంచి చెడ్డల విచక్షణా రూపంలోంచి కఠోర సత్యాల్ని వెలికి తీస్తాయి. అలా సానబెట్టిన రాపిడిలోంచే ఈ వాక్యాలు ఊపిరి పోసుకున్నాయి.

**"రాజకీయపు చదరంగంలో**
**అమాయకపు శకటాల పోరాటం**
**నలిగిన లేగదూడలు**
**పొట్టేళ్ళ మధ్యన మేకపిల్లలు**
**పావులు కదుపుతున్న ప్రత్యర్థులు"** అని ఛాయామాత్రంగా వర్తమాన సంక్షుభిత వ్యవస్థ తీరుతెన్నుల్ని దోచుకోబడుతున్న అమాయకపు జీవుల ముఖచిత్రాన్ని రాజకీయ నేపథ్యంలో ఎండగట్టి అక్షరీకరిస్తారు రత్నంగారు. ఇందులో 'పొట్టేళ్ళ మధ్య మేకపిల్లల్ని' 'నలిగిన లేగదూడలు'గా చిత్రీకరించి బలి పశువులుగా మారే అమాయక నైజాన్ని కళ్ళకి కట్టిస్తారు.

ఇలా చెప్పుకొస్తూనే చివరికొచ్చే సరికి తనకవితల్లోని అంతఃసూత్రాన్ని సహజ దృష్టితో సరళమైన భాషలో చెబుతారు.

**"మనసంతా కకావికలం**
**అయినప్పుడు అక్షరాలు**
**సేద తీరుస్తాయి"** అంటూ నలిగిన మనసును అక్షరాల్లో ఆవిష్కరించి తేలికపాటుతనంలోని శాశ్వత ఆనందాన్ని అనుభవాలుగా పలవరించి జీవితాన్ని ఆస్వాదించే ప్రయత్నం చేస్తారు.

ఇలా కలవరిస్తూనే దాని పర్యవసాన మూల స్వభావ లక్షణాన్ని అక్షర భాషలో వ్యక్తీకరిస్తారు.

**" స్వప్నంలో జ్ఞాపకాక్షరాలు మారి**
**కలలను నిక్షిప్తం చేసి**
**జాలువారే సెలయేటి గలగలలై**
**తెల్లకాగితపు పైన**
**తెలిమబ్బులై వర్షిస్తాయి "** అంటారు. ఈ విధంగా చెప్పడంలో ఉండే మానసిక ఊరటని, పొందే తృప్తిని తేలిక మాటల్లో పొందుపరుస్తారు.

ఈ రీతిలో చెప్పుకుంటూ పోతే కవి రత్నంగారి వాక్యాల్లో అక్కడక్కడా తొణికిసలాడే భావ పరంపరలు కొన్నిచోట్ల కవితాత్మకమైన విందును పంచుతాయి. వీటిలో మచ్చుకు కొన్నింటిని రుచి చూద్దాం.

**"నిశిలో మరణించి/ఉదయంలో బతుకుతుంటాను " , " అరుణోదయంలో మెలకువ " , " తెల్లవారు జామున/కోడి కూతలన్నీ/నక్కల ఊళలవుతాయి " , " పాలకుల సమశీతోష్ణ గదుల్లో/వైకుంఠ పాళీ " , " కాగడా చూపుతో రక్షణ/వ్యవస్థల చుట్టూ అబద్ధాలు/పహారా కాస్తుంటాయి "," ఆనందంలో అక్షరాలు/వెలుగురేకలై పల్లవిస్తాయి"," నమ్మకం ఒక్కటే నడక "," వేకువలో చిరుగాలికి/రెపరెపలాడుతూ మొలకెత్తుతుంది "," కాలగమనంలో మారని చీకటివెలుగులు "," తప్పిపోయిన జ్ఞాపకాలను/వెతుక్కుంటున్న దేశదిమ్మరిని " దూరంగా నీ గానం/దగ్గరవుతున్న మురళీనాదం "** వంటి వాక్యాలు మనసుని ఆహ్లాద పరిచి ఊహల్ని తేలిక పరుస్తుంటాయి.

' హిప్నలిపి ' అని దీనికి పేరు పెట్టడంలోనే ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. విలక్షణమైన వైవిధ్య పూరితమైన భావావేశాలకు ప్రతీకగా ఈ దీర్ఘకవితలోని ప్రతి అక్షరమూ సొంత ముద్ర వేసుకొని ఆర్తితో ప్రాణ ప్రతిష్ఠ చేస్తాయి. లోచూపుతో నిండిన ఈ పుస్తకం అమిత వేగంతో కాకుండా స్థూలదృష్టితో ఆలోచనాత్మకంగా అడుగులు వేయించి సృజనాత్మకతకి పెద్దపీట వేసి ఆసాంతం చదివింపచేస్తుంది.

పాతకొత్తల మేలుకలయిక భావాలతో ఇంత మంచి కవిత్వాన్ని సముచిత రీతిలో పాఠకులకి అందించిన కవి యం.వి.రత్నం గారు నిజంగా ధన్యులు.

భవిష్యత్తులో మరిన్ని చైతన్యవంతమైన రచనలతో ధీటైన కవిత్వాన్ని సమాజానికి అందిస్తారని ఆశిస్తూ కవిగారికి అభినందనల్ని తెలియజేస్తున్నాను.

**ప్రతులకు:** యు.వి.రత్నం,
విశ్రాంత బ్యాంక్ మేనేజర్
యు. శాంతికుమారి
డో.నెం.8-3-13, కొత్తపేట,
లాయరుపేట పోస్టు,ఒంగోలు
ప్రకాశం జిల్లా
ఆంధ్రప్రదేశ్.
సెల్:9390411069



-ఎన్.లహరి
9885535506

## కవిత్వం

మనసులో ఆలోచనలు ఉద్భవిస్తేనే
కవిత్వం రసగంగ ప్రవాహంలా
జాలువారేది
అక్షరాలను నిత్యం అభిషేకిస్తేనే
పదాలు నాట్యమయూరిలా
నాట్యం చేసేది.
ఎన్ని పదాల భావకలయికనో కవిత్వం
ఎన్ని అనుభూతుల
సంగమమో కవిత్వం.
సమాజాన్ని నిత్యం దర్శిస్తేనే
లోతుపాతులు తెలిసేది
చీకట్లోకి తొంగిచూస్తేనే
వెలుతురు చినుకుల్లా ప్రకాశించేది
వాస్తవాన్ని తెలుసుకుంటేనే
కాలాన్ని చిత్రిక పట్టేది.
మెలకువలో కవిత్వం
నిదురపట్టని రాత్రయితది
రాయలేని భావమేదో
ఒళ్ళంతా తచ్చాడుతది
గాయపడిన దేహానికి
కన్నీటివాగై ప్రవహిస్తది
విరహప్రేమికుల వియోగానికి
విషాదరాగమై ఆలపిస్తది.
దుఃఖాన్ని ఎన్ని రోజులని మోయగలం
ఆనందాన్ని
ఎన్నిసార్లని అనుభవించగలం
కవిత్వమంటే మోయలేని దుఃఖబాధ
కవిత్వమంటే సమాజాన్ని
దుమ్ముదులిపే కరవాలం
కవిత్వమంటే రేపటి వేకువను
ఆలింగనం చేసుకోవడం.
చీకటితో యుద్ధం చేసే
వెలుతురుపిట్ట కవిత్వం
అవినీతి బూజును దులిపే
అక్షరశూలం కవిత్వం
దుర్మార్గాలను ఎండగట్టే
ఆదిపరాశక్తి కవిత్వం
జీవితపు మట్టిదీపమై
వెలిగేదే కవిత్వం.
కవిత్వమంటే....
పరుగెత్తే కాలాన్ని ఒడిసిపట్టి
సమాజంపైకి విసరడం
చరిత్రకు సాక్ష్యంగా నిలిచి
దివిటియై వెలుగొందడం
పేదల బతుకులను
నిత్యదీపమై వెలిగించడం
కవిని ఓదార్చే మంత్రం కవిత్వం
కవిగా నిలబెట్టే అక్షరం కవిత్వం
సమాజాన్ని తట్టిలేపేదే కవిత్వం
వాస్తవాన్ని ముద్దాడేదే
కవిత్వం



-డాక్టర్ భీంపల్లి
శ్రీకాంత్
9032844017

## కన్నీటి చుక్క

కష్టం కలిగితే రాలిన చుక్క!
కల కరిగితే జారిన చుక్క!!.
కష్టం కదలి అని
తను ఉప్పగా చెపుతుంది!
వేదనలోంచి వచ్చానని
వెచ్చగా ఉంటుంది!!.
జారుతూ జారుతూ
చెక్కిలిని ముద్దాడుతుంది
బెంగపడకని!
నీటిచుక్క నీడన
భవిష్యత్తు మసక మసకగా కన్పిస్తుంది!!.
బాధ తగ్గేవరకు మనతోనే ఉంటూ
బాధపడే మనసుకు
బరువు తేలికచేసి వెళుతుంది!!
ఓర్చుకుంటే ఆనంద భాష్పమై
తిరిగి వస్తానని
చెపుతుంది!!



-జగ్గయ్య.జి
9849525802

# నీవు లేక నేను లేనే లేనులే..

కథ

"మనం అనుకున్న విషయం గురించి ఏం ఆలోచించావు దివ్యా?"
"అందులో ఆలోచించడానికేముంది విశ్వం? నేనాడే చెప్పానుకదా అది నా వల్ల కాదని"
"నీ మాట నీదే కాని ఎదుటి వాళ్ల మాట పట్టదా నీకు? నేనెందుకు చెబుతున్నానో కాస్త ఆలోచించు."
"నేనూ అదే అంటున్నాను, నువ్వు కూడా నా వైపు నుంచి ఆలోచించు."

"ఇలా మాటకు మాట తిప్పి కొట్టడమేనా? ఇది ప్రెస్టిజ్ ఇష్యూగా తీసుకోకు. మన కుటుంబ శ్రేయస్సు కోరి మళ్లీ చెబుతున్నాను. సావధానంగా ఆలోచించు దివ్యా. ఇప్పుడు మనం ఆర్థికంగా మనం బాగా స్థిరపడ్డాం కదా?"

"బాగా ఆలోచించే చెబుతున్నాను. నేను ఉద్యోగం చేస్తున్నది మన ఆర్థిక బలోపేతానికి కాదు. ఉద్యోగంలో ఉన్నందున నాకో గుర్తింపు ఉంది. నా కాళ్లపై నిలబడ్డాననే తృప్తి ఉంది. నా అస్తిత్వానికి ఎసరు పెట్టేందుకు ప్రయత్నిస్తే తాడు తెగుతుంది. కట్టె విరుగుతుంది. అంతే గానీ నా ధోరణిలో మార్పుండదు విశ్వం."

"నిన్ను ఏరి కోరి చేసుకున్నందుకు నాకు తగిన శాస్తి చేస్తున్నావు. బ్యాంకులో మానేజరుగిరీ చేస్తున్నానని విర్రవీగుతున్నావు. నీ మొండితనంతో మన కాపురంలో నిప్పులు పోస్తున్నావు. నీతో వాదించేకన్నా ఆ గోడకు తల బాదుకోవడం నయం." విశ్వం అస్త్ర సన్యాసం చేసి పడక గదిలోకి వెళ్లాడు.

'అలా రా దారికి అనుకుంటూ తల ఊపుతూ దివ్య, ఇంకో పడక గదిలోకి వెళ్లింది.

దివ్య, విశ్వం ప్రేమించి, ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి, పెళ్లి చేసుకున్న జంట. దాదాపు ఆరేళ్ల కాపురం సజావుగా సాగింది. వారి దాంపత్యఫలంగా ఇద్దరు పిల్లలు కలిగారు. వాళ్లు పెరుగుతున్నకొద్దీ భార్యా భర్తల బాధ్యతలు కూడా పెరిగాయి. అక్కడే వచ్చింది పేచీ. ఇంటి బాధ్యతలు ఇద్దరూ సమంగా పంచుకోవాలనేది దివ్య వాదన. వ్యాపార పనుల్లో బిజీగా ఉన్న తనకు అంత తీరిక ఉండదని విశ్వం ప్రతివాదన. అంతగా కావాలనుకుంటే దివ్యను ఉద్యోగం వదిలేయమని పోరు. దానికి ఆమె సిద్ధంగా లేదు. విశ్వాన్నే తన వ్యాపార విస్తరణ కార్యక్రమాన్ని విరమించుకోమని సూచించింది. అక్కడ పురుషాధిపత్యం పడగ విప్పింది. మాటా మాటా పెరిగి, చివరకు దివ్య, తమ పిల్లలను తీసుకొని ఇంటిని వదిలేసింది.

విషయం తెలిసిన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, వారిద్దరి మధ్య సయోధ్య కుదర్చడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. పిల్లల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొనైనా కలిసి ఉండుమని ఉద్బోధ చేశారు. కానీ ఇద్దరూ తమ తమ పట్టు విడువలేదు సరికదా ఇంకా బిగుసుకుపోయారు. అంతే కాదు ఆర్నెళ్ల తర్వాత విశ్వం, దివ్యకు తన లాయరు ద్వారా విడాకుల నోటీసు పంపాడు. దివ్యకు మరింత కోపం వచ్చింది.

'నేను విడాకులు ఇవ్వను గాక ఇవ్వను. అతని మరో మనువుకు దారి సుగమం చేసేందుకు' ససేమిరా అంది. తన వ్యాపార విస్తరణలో పడ్డ విశ్వం రెట్టించలేదు.

రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలోని పది జిల్లా కేంద్రాల్లో తన వ్యాపార కార్యాలయాలు నెలకొల్పాడు. అడ్డగోలుగా సిబ్బంది నియమించి వ్యాపారాన్ని వారికి వదిలి, అతను క్లబ్బుల్లో, పబ్బుల్లో ఆనందం వెతుక్కోసాగాడు. అప్పుడప్పుడు తన వ్యాపార కేంద్రాలను సందర్శించి తూతూ మంత్రంగా తనిఖీ చేశానని తృప్తి పడేవాడు.

తమ యజమాని నిర్లక్ష్యాన్ని అలుసుగా తీసుకున్న సిబ్బంది తమ చేతి వాటం చూపించారు. క్రమక్రమంగా డబ్బులు కాజేయ సాగారు. నగదు అమ్మకాల మొత్తం బ్యాంకులో జమ చేయకుండా కొంత తమ అవసరాలకు, తమ బంధువుల ఖాతాలోకి మళ్లించారు. ఫలితంగా బ్యాంకు కిస్తీలు, సరఫరాదారుల సొమ్ముల బకాయిలు పెరిగాయి. విశ్వం కళ్లు తెరిచేసరికి పరిస్థితులు చేయి దాటిపోయాయి. సిబ్బంది పత్తాలేకుండా పోయారు. బ్యాంకు నుంచి నోటీసులతో, సరఫరాదారుల ఒత్తిడితో, విశ్వం ఉక్కిరి బిక్కిరయ్యాడు. జిల్లా కేంద్రాల్లో విస్తరించిన శాఖలు మూసేయాల్సి వచ్చింది. కొన్ని ఆస్తులమ్మి బకాయిలు చెల్లించాడు. ఆ పరిస్థితులు, విశ్వం ఆరోగ్యంపై ప్రభావం చూపాయి. మధుమేహం, రక్తపోటు, హృదయపోటు ముప్పేట దాడి చేశాయి. విశ్వానికి ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది. రెండు వారాల చికిత్స తర్వాత, ఆహార నియమాలలో ఎన్నో అంకుశాలు సూచించి, కనీసం నెల రోజులపాటు ఇంట్లో విశ్రాంతి తీసుకోవాలన్నారు డాక్టర్లు.

గత్యంతరంలేని విశ్వానికి, ఇంటికి పరిమితమయే అగత్యం పట్టింది.

ఇంటి పనికి, వంట పనికి మనుషులున్నా, విశ్వంలో ఏదో వెలితి. డాక్టర్లు చెప్పిన ఆహార నియమాలు, పథ్యం, పాటించడం కుదరడం లేదు. అప్పుడతనికి జ్ఞప్తికి వచ్చింది దివ్య. అంతకు ముందు రాలేదని కాదు. కాని అప్పుడు జవసత్వాలు సరిగ్గా ఉండడంతో కొట్టి పరేసేవాడు. తన మనసుసును వ్యాపారంపై మళ్లించి దివ్యను మరిచిపోయే ప్రయత్నం చేశాడు. ఇప్పుడు? తన అనారోగ్యం, అతన్ని భూమి మీదకు తెచ్చింది. దివ్యతో తన ప్రేమ గుర్తుకొచ్చింది. తాము గడిపిన ఆనంద క్షణాలు కళ్ల ముందు కదలాడాయి. పట్టుదలకు పోయి తాను సాధించిందేమిటి? జీవితంలో తాను ఓడిపోయిన భావన మొట్టమొదటిసారి విశ్వం మనసులో చోటు చేసుకుంది.

విశ్వంలో అంతర్మథనం మొదలైంది. అప్పుడనిపించింది, దివ్య తన విడాకుల నోటీసును కొట్టిపారేయడమే మేలైందని. ఆమెను మళ్లీ తన జీవితంలోకి ఆహ్వానించాలి. కాని ఎలా? అహం అడ్డు వచ్చింది. చింత చచ్చినా పులుసు చావలేదు. ఎవరైనా మధ్యవర్తులను సంప్రదిస్తే? కాని ఎవరున్నారు ముందుకు రావడానికి? తాము విడిపోయిం తర్వాత కొందరు బంధువులు, స్నేహితులు సయోధ్య

> "నిన్ను ఏరి కోరి చేసుకున్నందుకు నాకు తగిన శాస్తి చేస్తున్నావు. బ్యాంకులో మానేజరుగిరీ చేస్తున్నానని విర్రవీగుతున్నావు. నీ మొండితనంతో మన కాపురంలో నిప్పులు పోస్తున్నావు"

కుదర్చడానికి ప్రయత్నిస్తే తానేం చేశాడు? వారిని పాలల్లో పడ్డ ఈగల్లాగ తీసేశాడు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని వారిని సంప్రదిస్తాడు? ఆలోచించి, ఆలోచించి అతని తల వేడెక్కింది. మందులు ఏ మాత్రం అతని జబ్బులను తగ్గించక పోగా, మనోవ్యథ వల్ల అవి మరింత వికటించాయి. ఫలితంగా విశ్వం మళ్లీ ఆస్పత్రి పాలయ్యాడు. హృదయంలో పెరిగిన బ్లాకులకు బైపాస్ తప్పనిసరైంది.

అక్కడ దివ్య జీవితం కూడా అంత సజావుగా సాగ లేదు. పదోన్నతిపై వేరే నగర ముఖ్య శాఖకు బదిలీ అయింది. హోదాతో పాటు బాధ్యతలూ పెరిగాయి. తన కింద పనిచేసే వందకు పైగా ఉన్న సిబ్బందిపై అజమాయిషీ చేయడం కఠినతరమైంది. అప్టరాల్ ఒక ఆడ మనిషికి అణిగిమణిగి ఉండాలా అనే భావన కొందరు కింది తరగతి ఉద్యోగుల్లో పొడచూపింది. వారు ఆమెకు విరుద్ధంగా యూనియన్ నాయకులను ఎగదోశారు.

దాంతో దివ్యపై ఒత్తిడి పెరిగింది. తన సహజ చాకచక్యంతో ఆ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నా, ఆమె మానసికంగా కృంగిపోయింది. దాంతో పిల్లలపై శ్రద్ధ తగ్గింది. వారు చదువులో వెనుకబడ్డారు. అత్తెసరు మార్కులతో ఏదో విధంగా పాసవ సాగారు. ఆ పరిస్థితులతో ఒత్తిడి ఎక్కువై ఆమె ఆరోగ్యం కూడా క్షీణించింది.

అప్పుడు దివ్య ఆలోచనలో పడింది. తను విశ్వంతో వేరుపడి సాధించిందేమిటి? మనఃశాంతి కరువు చేసిన తన ఉన్నత ఉద్యోగంపట్ల విముఖత ఏర్పడసాగింది. తన అనారోగ్య ప్రమాణ పత్రాలు చూపి, నానా తంటాలుపడి, వేరే నగరంలోని బ్రాంచి ఆఫీసునుండి, తమ పట్టణంలోని అడ్ మినిస్ట్రేటివ్ ఆఫీసుకు బదిలీ చేయించుకుంది. అక్కడ పని ఒత్తిడి తగ్గటంతో భౌతిక బాధ తగ్గింది కాని, మానసిక వ్యథతో దివ్య, రోజు రోజుకి క్షీణించ సాగింది. ఆరేళ్ల తమ దాంపత్య జీవితం కళ్లముందు కదలాడ సాగింది. విశ్వం పదే పదే జ్ఞాపకం రాసాగాడు. అంతలో ఎవరో, విశ్వం ఆస్పత్రి పాలయ్యాడనే వార్త చేర వేశారు. ఇక ఆలోచించ లేదు దివ్య. హుటాహుటిన ఆస్పత్రిలో వాలిపోయింది. అప్పటికి మూడు రోజుల క్రితమే బైపాస్ శస్త్ర చికిత్సకు లోనైన విశ్వం, ప్రత్యేక గదిలో సేద దీరుతున్నాడు.

దివ్యను చూడగానే అతని కళ్లల్లో ఆశ్చర్యానందం! అతనికి తెలియకుండానే కళ్లు వర్షించసాగాయి. అటు దివ్య పరిస్థితి కూడా వేరుగా లేదు. విశ్వం పట్ల ఆమెలో ఉన్న కల్మషం, కన్నీళ్ల రూపంలో బయటికి వెళ్ల సాగింది. ఓ పది నిమిషాలు వారిద్దరి మధ్య మౌన సంభాషణ. ఆ తర్వాత దివ్య, విశ్వం చేతిని తీసుకుని తన పెదవులకు అంటించుకుంది. విశ్వంలో దుఃఖం ఇనుమడించింది. బాధ, ఆనందం మిళితమైన ఒక అపురూప సందర్భమది. అతని కళ్లల్లో పశ్చాత్తాపం ప్రస్ఫుటమైంది. అదే సమయంలో దివ్య అభయహస్తం ఊరట కలిగించింది. దివ్య, తన కౌగిలితో విశ్వం కళ్లు తుడిచింది.

"ఇప్పుడు నేనొచ్చాను కదా? మీరు తొందరగానే కోలుకుంటారు. మీకు నమ్మకమైతే మనం మళ్లీ కలిసుందాం." దివ్య.

"అంతకంటే భాగ్యమా? మీ కొరకు మన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచి ఉంటాయి." విశ్వం కళ్లలో మెరుపు.

"సరే. మీరు ఆస్పత్రి నుంచి వచ్చేసరికి నేను, పిల్లలు మీ స్వాగతానికి సిద్ధంగా ఉంటాం."

ఆ మర్నాడే దివ్య, పిల్లలతో తమ ఇంట్లోకి మారింది. బ్యాంకుకి రెండు వారాల సెలవు పెట్టి అస్తవ్యస్తంగా ఉన్న ఇల్లు సర్దడంలో మునిగిపోయింది. ఆ తర్వాత విశ్వం రాకకై ఎదురు చూడ సాగింది. ఆస్పత్రినుంచి వచ్చిన తమ నాన్నను చూసి పిల్లలు కూడా సంతోష పడ్డారు. దివ్య శుశ్రూషతో పిల్లల సాంగత్యంలో విశ్వం తొందరగానే కోలుకున్నాడు. ఆ తర్వాత, దివ్య, విశ్వం లు మనసువిప్పి మాట్లాడుకున్నారు. తాము వేరుగా ఉన్న రోజుల్లోని అనుభవాలు, ఒకరికొకరు పంచుకున్నారు. అప్పుడు వారిద్దరి మనసులు తేట పడ్డాయి.

విశ్వం, కొన్ని రోజుల విశ్రాంతి తీసుకుని క్రమక్రమంగా తన వ్యాపారంపై దృష్టి సారించాడు. ఐతే లావాదేవీలు పరిమితం చేశాడు. ప్రొద్దున పది గంటలకు క్యారేజీ తీసుకొని పోయి సాయంత్రం ఆరు గంటలకల్లా ఇంటికి చేరుకుంటున్నాడు. ఆ తర్వాత భార్యా పిల్లలతో గడప సాగాడు. తండ్రి శ్రద్ధ తీసుకోవడంతో, పిల్లల చదువులు గాడిన పడ్డాయి. వారికి మంచి మార్కులు రాసాగాయి.

బ్యాంకులో తన ఇరవై సంవత్సరాల సర్వీస్ పూర్తి కాగానే దివ్య వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకుంది. తన పూర్తి సమయం కుటుంబానికే కేటాయించింది.

వారం రోజుల్లో తమ పెళ్లి రోజు ఉందని గుర్తు చేసింది దివ్య. కొన్నేళ్ల తర్వాత తామిద్దరు కలిసి ఉన్నందున దగ్గరి బంధువుల సన్నిహితుల మధ్య ఓ హోటల్లో భారీగా జరుపుకుందామన్నాడు విశ్వం. దివ్య తలూపింది. ఇంకేం విశ్వం విజృంభించాడు. ఓ స్టార్ హోటల్ లో బ్యాంకెట్ హాల్ బుక్ చేశాడు. దాదాపు యాభై మంది బంధువులకు, మిత్రులకు వాట్సాప్ లో ఆహ్వానాలు పంపారు దివ్య విశ్వంలు.

ఆ రోజు రానే వచ్చింది. ఆహుతుల్లో వారి కుటుంబ సభ్యులు దివ్య గత ఆఫీస్ సహచరులు విశ్వం వ్యాపార సన్నిహితులున్నారు. వారందరు కుటుంబ సమేతంగా రావడంతో పిల్లలకు మంచి ఆటవిడుపయింది. కొందరు యువతీ యువకులు సంగీతానికనుగుణంగా డ్యాన్స్ చేయసాగారు. మొత్తం మీద అక్కడ ఓ ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. కాసేపయింతర్వాత తమ ఆహ్వానాన్ని మన్నించి హాజరైనందుకు ఆహుతులకు తమ కృతజ్ఞతలు తెలిపారు దివ్య, విశ్వంలు. అప్పుడు, అందరిని ఉద్దేశించి విశ్వానికి బాబాయి వరసయే గుర్నాథం గారు మాట్లాడారు.

"మన దివ్య, విశ్వం ల పెళ్లిరోజు సంరంభానికి రావడం నాకెంతో ఆనందంగా ఉంది. మామూలుగా ఇలాంటి ఉత్సవాలు ఇంట్లోనే చేసుకుంటారు, కాని ఇది ఒక ప్రత్యేక సన్నివేశం. కొన్ని సంవత్సరాలు ఏవో కారణాలతో విడిపోయి, విడాకుల వరకు వెళ్లిన వారు, సర్దుబాటు చేసుకుని మళ్లీ ఒకటయ్యారు.

అదీ ఈ సెలిబ్రేషన్ కి కారణం. ఈ సందర్భంలో వేమన గారి స్ఫూర్తితో ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారు రాసిన ఓ పద్యం జ్ఞప్తికి వస్తోంది.

"భార్య యనెడు నొక్క భారంబు లేనిచో, పులియాకువోలె పురుషుడెగురు, దారి తప్పునీని దైవమ్ము భార్యరా, విశ్వదాభిరామ వినురవేమ"

అంటే భర్త అనే విస్తరిపై భార్య అనే బరువు లేక పోయిన సందర్భంలో, అతను దారి తప్పుతాడు. భర్తకు స్థిరత్వం కూర్చేది భార్య. భర్త జీవితాన్ని చక్క దిద్దేది భార్య అని భావార్థం. అందుకని ప్రతివారు తమ అర్థాంగి పట్ల గౌరవంగా ఉండి దాంపత్య జీవిత శకటాన్ని జోడెద్దులుగా ముందుకు నడిపించాలి. హాజరైన మీ అందరికీ ధన్యవాదాలు, దివ్య, విశ్వం కుటుంబానికి శుభాకాంక్షలు."

అందరు చప్పట్లు కొట్టారు. ఆ తర్వాత దివ్య బ్యాంకు పూర్వ సహచరులు దివ్య పనితనాన్ని కొనియాడుతూ మాట్లాడారు. ఎన్నో పదార్థాలతో భారీగా ఏర్పాటు చేసిన విందు భోజనం ఆరగించి దివ్య విశ్వం ల కుటుంబానికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆహుతులంతా సెలవు తీసుకున్నారు.

పార్టీ నుంచి ఇంటికి చేరుకున్న దివ్య, విశ్వం లు, వారిలో ఆనందం తొణికిసలాడుతుండగా, చాలా ఏళ్ల తర్వాత పడకగదిలో జతకూడారు. ఒక్క బెడ్ లైట్ తప్ప లైట్లన్నీ ఆఫ్ అయ్యాయి. ఇద్దరిలో ఏదో ఉద్వేగం. వారి మధ్య, గాలి కూడా చొరబడడానికి వెనకాడింది.

"నీవు లేక నేను లేనే లేనులే అదీ నిజములే" తెరిచి ఉన్న కిటికీ నుంచి గాలితో పాటు వచ్చిన ఆ పాట, వారిద్దరి భావాలకు అద్దం పట్టింది.



-అంబల్ల జనార్దన్
8850349858

పుస్తక సమీక్ష

# అనుబంధాల మేళవింపు "కొత్తవెల్లువ -మనసు వెన్నెల"






ఒక మహిళ క్యాన్సర్ లాంటి అనారోగ్య బారిన పడితే, కొద్దిగా కష్టమే అయినా కుటుంబం కోసం తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చుట్టుపక్కల వాళ్ళ వాళ్ళ హేళనకి గురవుతూ కూడా ఎంతో కష్టపడుతుంది. తపన చెందుతుంది. 'అమ్మ మారిపోయింది' కథలో పద్మావతి, 'అసలు ప్రేమ' కథలో సంగీత పాత్రలు ఇలాంటివే. క్యాన్సర్ లాంటి భయంకరమైన అనారోగ్యాన్ని ఈ మహిళలు ధైర్యంగా ఎదుర్కోటమే కాకుండా ఈ వ్యాధి పట్ల తోటి మహిళలకు ఒక రకమైనటువంటి అవగాహన కల్పించారు రచయిత్రి అని చెప్పవచ్చు. అలాగే ఓ మహిళ వివాహ బంధం ద్వారా కుటుంబంలో అడుగుపెట్టిన తర్వాత ఆ కుటుంబంలో ఒక ప్రముఖ వ్యక్తి అవుతుంది. అలాంటి మహిళలకు తగిన గౌరవం లేకపోతే ఆమె అలిగితే ఆ కుటుంబం పరిస్థితి ఎలా ఉంటుందో 'అమ్మ అలిగితే' అనే కథలో అద్భుతంగా వివరించారు రచయిత్రి.

ఈ రచయిత్రి కుటుంబ బంధాల్ని అద్భుతంగా వివరించిన మరోకథ 'అనుబంధం'. ఇందులో తండ్రి చనిపోతే అమెరికా నుండి తేజ అనే యువకుడు తెలంగాణ ప్రాంతంలోని తన గ్రామానికి తిరిగి వస్తాడు. సాధారణంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ఇలాంటి కథల్లో మనం గమనించే దేమిటంటే ఎవరూ మిగలనటువంటి ఆ గ్రామంలో ఇల్లు వాకిలి, పొలం పుట్రా అన్ని అమ్ముకొని పుట్టిన ఊరితో రుణం తీర్చుకుని వెళ్ళిపోవడం మనకు కనబడుతుంది. కుటుంబ విలువలకు,బంధాలకు ప్రాముఖ్యత నిచ్చే రచయిత్రి ఈ కథలో సరిగ్గా వ్యతిరేకంగా మాట్లాడతారు. తండ్రి చనిపోయే ముందు తన గ్రామంలో ఇంటినీ, ఇంటి ముందు ఉన్నటువంటి స్థలాన్ని ఏం చేయాలో, ఎలా మార్చాలో తన ఆలోచనలను కొడుకుతో పంచుకుంటాడు. ఈ విషయం కొడుకు అప్పటిదాకా బయట పెట్టడు. కానీ పదవరోజు తండ్రి కర్మకాండలు నిర్వహించారు. ప్రతిరోజు కాకి ముద్ద పెట్టడం కొన్ని కుటుంబాల్లో సాంప్రదాయం. ఏరోజు పక్షి వచ్చి ముద్ద ముట్టుకోదు. కానీ పదోరోజు కళ్ళు మూసుకొని ఒక కోరిక చెప్పుకుంటాడు తేజ. ఇప్పటివరకు లేనిది అదిగో రకరకాల పక్షులన్నీ ఎలా గుంపుగా వచ్చి ముదుతున్నాయో అంటూ బంధువులందరూ ఆనంద పడిపోయారు. ఇక్కడే మనకు ఇటీవల వచ్చినటువంటి 'బలగం' సినిమా గుర్తుకొస్తుంది కదా. తండ్రి కోరుకున్నట్లుగా ఇంటి ముందు ఉన్న విశాలమైన ఖాళీ ప్రదేశంలో చిన్న గుడి, వక్కనే లైబ్రరీ, కళలు ప్రదర్శించడానికి వేదిక, ఒక హాలు ఏర్పాటు చేయాలనుకుంటాడు కుమారుడు. ఒక కుటుంబంలో తల్లిదండ్రుల కోరిక తీర్చటం అంటే పితృ రుణం తీర్చుకోవడం అంటారు. అలా పితృ రుణం తీర్చుకోవడం కుటుంబ సంబంధాలకు అనుబంధాలకు ఒక గొప్ప ప్రతీకగా చూపించారు రచయిత.

వాక్కు అర్థం ఎలా కలిసి ఉంటాయో భార్య భర్తలు కూడా వేరువేరుగా కాక రెండు మనసులు ఏకమైన బంధమే ఏడడుగుల బంధం అంటారు రచయిత్రి "వాగర్థావివ సంపృక్తౌ" అనే కథలో. పైగా ఈ అనుబంధం గురించి , భార్యాభర్తల సంబంధం గురించి మనవరాలికి నాయనమ్మ వివరిస్తుంది. కుటుంబం అంటే భార్య భర్తల సంబంధమే కాదు నాయనమ్మకు కూడా ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. ఆమె అనుభవాన్ని కుటుంబ సభ్యుల మధ్య బంధం పటిష్టంగా ఉంచటానికి ఉపయోగపడుతుంది అని విశదీకరిస్తుంది ఈ కథ.

ఈ కథల్లో నాకు అర్థంకాని ఒక విషయం ఉంది. కథానాయికలకు ఎందుకు క్యాన్సర్ వస్తుందో, ఆ వ్యాధి నుండి బయటపడటానికి వాళ్ళందరూ యోగా వ్యాయామం చేయటం, తదనంతరం క్యాన్సర్ వ్యాధి నుండి బయటపడటం అనేక కథల్లో వివరించారు. కథ కాబట్టి ఇది సాధ్యమైంది అనుకుంటాను. అలాంటిదే మరొక కథ "నిర్ణయం" . ఇందులో శ్రావణి దినచర్యను మొదటిపేజీలో ఊపిరాడకుండా వివరించారు. కథ చివరిలో ఆమెకి కూడా క్యాన్సర్ ఉందని అందుకే యోగా చేస్తోందని ఆ విషయం ఆమెకు మాత్రమే తెలిసిన సంగతి అని రచయిత్రి చెబుతారు. ఇలాంటి కథలు ఈ పుస్తకంలో చాలానే కనపడ్డాయి. "సంసారంలో సరిగమలు " అనే కథలో కథానాయక అక్షర కు "క్రాన్స్ "వ్యాధి ఉంటుంది. చిన్న మాట పట్టింపు వల్ల , ఈగో వలనభర్త ను వదిలేసి పుట్టింటికి వస్తుంది. ఆమె మేనమామ సమస్యను పరిష్కరించి భార్య భర్తలు కలిసేలా చేస్తాడు. అందుకే ప్రతి ఇంట్లో పెద్దవాళ్లు ఉండాలంటారు. వారు దూరమైన ఇంట్లోనే ఇలాంటి గొడవలు ఎక్కువ అవుతాయి అంటూ రచయిత్రి మరోసారి తనదైన శైలిలో ముక్తాయిస్తారు.

ఎన్ని తరాలు మారినా మానవ సంబంధాల గురించి ఎప్పటికప్పుడు నిత్యనూతనంగా నిర్వచించవచ్చు. అలాగే కుటుంబ సంబంధాలు, కుటుంబం లోని సమస్యలు ప్రతి తరంలోనూ మార్పులు చెందుతూ ఉంటాయి. అందుకే అవి రచయితలకీ కథా వస్తువులు అవుతాయి అనటం లో సందేహం లేదు. అయినా ఈ విశాల ప్రపంచంలో ఎన్నో సమస్యలు ఉన్నా మారుతున్న కాలంతోపాటు సమస్యలు కూడా మార్పులు చెందుతూ రచయిత రచయితలను ఆకర్షిస్తూ ఉంటాయి. అందుకే రచయితల ఆలోచనా ప్రపంచం ఆకాశమంత అనంతమైనది. కానీ సుజనాదేవి ఈ సంపుటంలో మానవ సంబంధాలు, కుటుంబ సమస్యలను దాటి బయటకు రాలేదు. అందుకే పుస్తకం చదువుతున్నంత సేపు కథల్లోని ఇతివృత్తం ఒక దాని నుండి మరొక దానిలోకి చొచ్చు కొని బయటకు వచ్చినట్లుగా అనిపించింది. ఒకే రకమైన సమస్యను తిప్పి తిప్పి రాసినట్లుగా అనిపించింది. ప్రతి కథా శైలి మాత్రం ఆపకుండా చదివించింది. ఇది చాలా గొప్ప విషయం. కానీ రచయిత్రి తన పరిధి దాటి బయటకు వచ్చి ఈ విశాల ప్రపంచాన్ని గట్టిగా పరికించి చూడమని నా వినతి.

**ప్రతులకు: నామని సుజనాదేవి**
ఇ.నెం.1-1-484, చైతన్యపురి
ఆర్ఇసి పెట్రోల్ పంప్
ఎదురుగా, కాజీపేట,
హన్మకొండ-506004
799305575



-యన్.వి.
హనుమంతరావు
సెల్:9440890540

"రాత్రికి రాత్రే రంగాచారి అంతర్ధానం ఊర్లో పెద్ద వార్తయింది. వాస్తవానికి ఆ ఇంటి సభ్యులందరూ మంచివాళ్ళే. వృత్తికే అంకితమైన అనంతాచారి తండ్రినేవిధంగాను ఆక్షేపించే వాడు కాడు"

# ధనికుడు

(కథ)

"ఈ నెలరోజులు మేము అనుభవించిన నరకం...చాలు! ఎలాగైతేనేం... మీరు మాకు దక్కారు! వాస్తవానికి మీ దీవనలే మాకు వేనవేలు!"

ఉదయాన్నే ఇంటి పెద్దాయన రంగాచారి ఎవరికి చెప్పా చేయకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడు. ఆయన వయసు డెబ్బై. అర్చకత్వం మానేసి ఐదేళ్ళయింది. ఇంటివద్ద తేలికపాటి పనులు చేయటం, ఆపై మనవళ్ళ యోగక్షేమాలు చూడటం ఆయన దినచర్య. ఆయన వృత్తి మానుకోగానే, ఒక్కగానొక్క కుమారుడైన అనంతాచారి ఆ స్థానం భర్తీ చేశాడు. అతని వయస్సు ముప్పై ఐదు.

పరబ్రహ్మశాస్త్రి ప్రధానార్చకుడుగాను, మరో ముగ్గురు సహాయకులుగాను గల ఆ ఊరి శ్రీలక్ష్మీ నరసింహాలయం చాలా పెద్దది. పురాతనమైంది. గుడి చుట్టూ ఊరు విస్తరించి వుంది. గుడినానుకొని వున్న వరుస పెంకుటిళ్ళే అర్చకుల నివాసాలు.

రాత్రికి రాత్రే రంగాచారి అంతర్ధానం ఊర్లో పెద్ద వార్తయింది. వాస్తవానికి ఆ ఇంటి సభ్యులందరూ మంచివాళ్ళే. వృత్తికే అంకితమైన అనంతాచారి తండ్రినేవిధంగాను ఆక్షేపించే వాడు కాడు. అతని.. భార్య వేదవతి అన్నింటా సౌమ్యురాలు. ఆమె అత్త మామలైన వెంకుమాంబ, రంగాచారులకు అనుకూలంగా మెలిగేది. వరుసగా ఆరు, నాలుగేళ్ల వయస్సు గల వాళ్ళ పిల్లలు తండ్రి కంటే తాతయ్యతోనే చనువుగా వుండేవాళ్ళు. రంగాచారికీ మనవళ్ళంటే ఎనలేని ప్రేమ. ఇక వెంకుమాంబకు భర్తతో ఎలాంటి అరమరికలు లేవు. మరి అలాంటి నేపథ్యంలో పెద్దాయనకు కలిగిన యిబ్బందేంటి? అదీ.. అకస్మాత్తుగా ఇల్లు వదిలేయాల్సిన అగత్యమేంటి? ఇవే... ఆ ఇంట్లో పెద్ద ప్రశ్నలయ్యాయి.

ఎలాగైతేనేం విషయం ఊరంతా పొక్కింది.

"ఆ అనంత గాడు పైకి మెత్తగా కనిపిస్తాడు గాని, లోలోన మహా కఠినాత్ముడండీ! వాడి ఆగడాలు భరించలేకే పెద్దాయన పారిపోయాడు!" గుడి ప్రాంగణంలో గుసగుసలు గుప్పుమన్నాయి.

"అంతే కాదండీ! వేదవతి కూడ మహా గడుగ్గాయట! ఏదో.. కోపంతో చేటో... చీపురో తిరగేసుంటుంది! దాంతో ముసలాయన.. పలాయనం చిత్తగించాడు!" సంత బజార్లో అమ్మలక్కలు పరస్పరం చెవులు కొరుక్కున్నారు.

"మరే... వెంకుమాంబా నిత్యం భర్తను సాధిస్తూ పీడించేదట!" ఇరుగు పొరుగువారు కనుసైగలతో నవ్వుకున్నారు.

అలా నీలాపనిందలు అనంతాచారి కుటుంబీకులను సుడిగాలిలా చుట్టి ఉక్కిరిబిక్కిరి చేయసాగాయి.

ఆ కర్ణి.. ఆ కర్ణి... ఈ వార్తలు పరబ్రహ్మశాస్త్రి చెవిన బడ్డాయి. రంగాచారిపై అచంచల సదభిప్రాయం గల ఆయన ఖిన్నుడై అనంతాచారిని పిలిపించి... విషయ మేమిటని ప్రశ్నించాడు.

"అవన్నీ కట్టుకథలండీ గురువుగారూ! నేనుగా... నా తండ్రినెప్పుడు పల్లెత్తు మాట కూడా అని ఎరుగను! ఇక నా భార్యగాని, అమ్మగాని అయన్ను భక్తిశ్రద్ధలతో చూసుకునేవారు!" అనంతాచారి వివరించాడు.

"మరి... ఈ విమర్శలేంటయ్యా? పైగా.. పెద్దాయనకు ఇల్లు వీడాల్సిన అవసరమేంటి? ఏమైనా... నిప్పు లేకుండా పొగ రాదు కదరా!" శాస్త్రి నిలదీశాడు.

"అలాంటిదేమి..లేదండీ! పైగా వెళ్ళే ముందురోజు రాత్రి ఆయన మా అందరితో పేరు పేరున ఉల్లాసంగా మాట్లాడి మరీ నిద్ర కుపక్రమించాడు!"

"అది సరేనయ్యా! అప్పుడాయన బట్టలు వగైరా సర్దుకున్నట్టేమయినా... కనిపించాడా? వెళ్లే ముందుగా ఉత్తరం లాంటిదేమైనా రాసి పెట్టాడా?"

"లేదండీ!"

"పోనీ... ముందురోజు ఏ విషయమైనా మీతో బాధగా గాని, కోపంగా గాని, విసుగ్గా గాని మాట్లాడేడా?"

"లేదండీ! దానికి తోడు ఆయన సెల్‌ఫోన్ వెళ్ళినప్పటి నుంచి స్విచ్ఆఫ్ వస్తుందండీ!"

"మరి... ఈ అకస్మిక సంఘటనకు కారణ మేమంటావురా?" శాస్త్రి స్వరం తీవ్రంగుంది.

"అది తెలియకే కదండీ... వేం సతమతమౌతుంట!" అనంతాచారి గొంతు బొంగురుపోయింది. కళ్ళు తడయ్యాయి.

"దిగులు పడకురా...ఆచారీ! కాని మొత్తానికెక్కడో...ఏదో పొరపాటు దొర్లింటుందయ్యా! అది... మీరు గమనించలేక పోయుంటారు!" మాటల్లో స్థిరత్వం ధ్వనించింది.

"పొరపాటు కాదండీ! ఇదంతా మా గ్రహపాటుగా వుంది!" అనంతాచారి తల పట్టుకున్నాడు.

అంతే! శాస్త్రి బుర్రలో ఓ ఆలోచన మెరిసింది.

"ఒరే...ఆచారీ! నీవన్నదే నిజం! ఇది ముమ్మాటికీ గ్రహపాటే! ఒకసారి నీ రాశి చక్రం తీసుకురా! పరిశీలిస్తా! పైగా కొంత గణన చేస్తే మీ తండ్రి దిశ, థ కూడా కనుక్కోవచ్చు!" శాస్త్రి ఆదేశించాడు.

దాంతో అంధకారంలో అలమటించే అనంతాచారికి ఓ వెలుగు రేఖ కనిపించింది. ఆపై అతను త్వరగా ఇంటికి వెళ్ళి చక్రం తెచ్చిచ్చాడు.

శాస్త్రి వెంటనే గణన ప్రారంభించాడు. అనంతాచారి ఆత్రంగా ఫలితంకై నిరీక్షించ సాగాడు.

చాలాసేపు నిశ్శబ్దం...

చివరకు శాస్త్రి "ఆచారీ! జాతకరీత్యా నీకిప్పుడు చంద్రుడు నీచస్థానంలో వున్నాడు! దాంతో అపనిందలు, తద్వారా మానసిక వ్యథలు తప్పవు! ఆపై ప్రశ్నాశాస్త్ర ప్రకారం మీ నాన్న ఉత్తర దిశలో క్షేమంగానే వున్నాడు! కాగా శాస్త్రోక్త విధానంగా నీవు పూజ చేసి చంద్రానుగ్రహం పొందాలి! అందుకు వచ్చే సోమవారమే ముహూర్తం!" అని వివరించాడు.

ఆ మాటలతో కొంత ఓదార్పు లభించిన అనంతాచారి "అలాగే... గురువుగారూ!.. ఇక శలవు!" అని ఇంటికి నడిచాడు.

రంగాచారి... క్షేమమే అన్న శాస్త్రి జోస్యం అతని కుటుంబ సభ్యులకు స్వల్ప ఊరట కల్గించింది. అయితే ఎక్కడ ఉన్నాడు?.. ఏం చేస్తున్నాడు?... ఎందుకు యిల్లు విడిచాడు. అనే ప్రశ్నలు వాళ్ళను వేధిస్తూనే వున్నాయి.

"ఒరే రంగా! ఇలాంటి కొడుకును గన్న నువ్వు ధన్యుడివిరా! అలాంటి నీకు వెధవ ఆస్తులెందుకురా?"

ఇక సోమవారం అనంతాచారి గుడి ప్రాంగణాన గల చంద్రుడి విగ్రహానికి పాలాభిషేకం చేసి, తెల్లని వస్త్రం కట్టబెట్టి నిష్టగా పూజ జరిపించాడు. అలా తతంగమైతే ముగించాడు గాని, అతనికి తండ్రి యోగక్షేమాలపై అనుమానాలు పొడసూపుతూనే వున్నాయి. ఇక దినపత్రికల్లో వచ్చే అనాధ శవాల వార్తలు అతన్ని విశేషంగా గాబరా పెట్టసాగాయి.

అలాంటి పరిస్థితిలో అనంతాచారి కుటుంబంలో పూర్వపు సమన్వయం లోపించి తెలియని యాంత్రికత చోటుచేసుకుంది. దానికి తోడు "నాన్నా!... తాతయ్యేడి? ఆయన్ను మేము ఇప్పుడే చూడాలి! ఆయనతో ఆడుకోవాలి!" అంటూ కొడుకులు చేసే మారాము అతని ఆవేదనను రెండింతలు చేసింది.

ఈలోగా పక్షం రోజులు గతంలోకి జారుకున్నాయి.

అప్పటికీ తండ్రిని గురించి ఏ వార్త లేకపోవటంతో అనంతాచారి ఆలోచనలు పరిపరి విధాలుగా పోసాగాయి. అదీగాక ఒకరోజు.. అర్చకత్వానికై ఇంటి నుండి బయల్దేరేటప్పుడు అతని తల్లి ప్రక్కింటావిడతో "ఏం చేస్తాం...లక్ష్మమ్మా! ఆయన ఇల్లు వదిలి నెలపైనే అయింది! ఇంతవరకూ ఏ కబురూ లేదు! అలా అని మా అనంతు గట్టిగా వెతికించిన దాఖలాలు లేవు! మేము ఏ పూజలు చేసి అలాంటి కొడుకును కన్నామో! అంతా మా ప్రారబ్ధం!" అంటున్న మాటలు ఈటెలై అతని మనసుని తాకాయి. దాంతో అతని వ్యథ తారాస్థాయికి చేరింది.

ఆ స్థితిలో గుడికి చేరిన అనంతాచారి ఎలాగో నిత్యార్చనలో... నిమగ్నమయ్యాడు. భక్తులు ఒకరొకరుగా వస్తున్నారు. వారి వారి కోర్కెల మేరకు పూజలు నడిచాయి.

మధ్యాహ్నం రెండు గంటలకు కార్యక్రమాలు ముగిశాయి. ఇక అతను అర్చక దుస్తులు మార్చుకొని మామూలు పంచె చొక్కా ధరించాడు.

గర్భగుడి దీపకాంతులలో వెలిగిపోతున్న స్వామివారి సన్నిధిలో భక్తి ప్రపత్తులతో నుంచున్న అతని మదిలో బాధా తరంగాలు.. ఉవ్వెత్తున లేవగా తక్షణ కర్తవ్యం బోధ పడింది.

"దేవా! అమ్మ.. అన్నట్లు నాన్నను వెతికే ప్రయత్నాలు అంతంత మాత్రమే జరిగాయి. కేవలం పూజాదులతో పని జరగాలనుకుంటున్నా! మరి..దైవ సహాయానికైనా మానవ యత్నం కావాలిగా! కాబట్టి... ఈ క్షణమే..ఇలాగే.. నేను నా తండ్రిని వెతకటానికై బయలుదేరుతున్నా! ఇన్నేళ్ళుగా నేను నీ సేవ చేస్తున్నది, ఆపై.. నీవున్నది నిజాలైతే నా ప్రయత్నం సఫలం చెయ్! అలా కాకుండా నేను ఇంటికి తిరిగి వచ్చేది లేదు! మరలా నీ పూజ చేసేది లేదు!" అనే సంకల్ప బద్ధమైన వేడుకోలుతో అతను గుడికి తాళాలేసి, కాపలాదారుడికి తాళం చెవులిచ్చి బయటకు నడిచాడు.

అలా దీక్షపూనిన అతను ప్రొద్దుగుంకే వేళకు ఊరి పరిసరాలు దాటి సుదీర్ఘ నడకతో పొరుగూరు బస్టాండుకు చేరాడు. మార్గమధ్యంలో తారసపడిన అనేకమంది సుపరిచితులు మరియు అపరిచితులకు తన తండ్రి..రూపరేఖలు చెప్పి వివరాలడిగాడు. కానీ, ఫలితం శూన్యంగానే మిగిలింది. అప్పటికి బాగా అలసిపోయిన అతను అక్కడ ఓ బెంచ్‌పై కాసేపు విశ్రాంతి తీసుకున్నాడు. ఆపై కర్తవ్యం గుర్తుకొచ్చి అసంకల్పితంగా అప్పుడే కదులుతున్న నంద్యాల బస్ ఎక్కి చివరి సీట్‌కు చేరాడు.

బస్ స్టేషన్లో దిగిన అతను "... మీ తండ్రి ఉత్తరాన క్షేమంగున్నాడు!" అని శాస్త్రి చెప్పిన సంగతి తలపుకు రాగా అక్కడికి ఉత్తర దిశగావున్న రైల్వేస్టేషన్‌కు కాలి నడకన చేరుకున్నాడు.

అప్పటికి రాత్రి పన్నెండైంది.

అతను నేరుగా బుకింగ్ కౌంటర్‌కు నడిచి ద్రోణాచలం వరకు.. సికింద్రాబాద్ పాసెంజర్ టిక్కెట్ కొనుక్కొని.. క్యాంటిన్‌లో టిఫిన్ చేసి, ఓ వెయిటర్స్ బెంచ్‌పై కూర్చొని రైలు రాకకై చూడసాగాడు.

ఆ వేళలో చాలా రైలుబండ్ల రాకపోకలున్నందున స్టేషన్ రద్దీగుంది. అక్కడ తిరుగాడే జనంలో తన తండ్రి కనిపిస్తే బాగుండుననే.. ఆశ మనస్సును వెంటాడుతుంటే అనంతాచారి ప్రతి వ్యక్తిని గమనిస్తున్నాడు. అలా జరగాలని యిష్ట దైవాన్ని మనసారా వేడుకుంటున్నాడు.

ఇంతలో బెంగుళూరు నుండి వచ్చిన రైలుబండి ఆగటం అతను కూర్చున్న బెంచ్ ఎదురుగా నిలబడిన బోగీ నుండి ఇద్దరు వ్యక్తులు ఒకరి తర్వాత మరొకరుగా క్రిందకు దిగి కలయ చూస్తుండడం జరిగాయి.

ఆశ్చర్యం! వారిలో ఒకాయన సాక్షాత్తు రంగాచారి!

అలాగే నిర్ఘాంతపోయి చూస్తున్న అనంతాచారి "నాన్నా!..నాన్నా!" అంటూ ఒక్కదుటున పరుగెత్తి తండ్రిని చుట్టేశాడు.

"ఉన్నావు స్వామి! నరసింహా! నువ్వున్నావయ్యా! నా విన్నపాలు విన్నావయ్యా! నా తండ్రి నాకు లభించాడు! చంద్రదేవా! కనికరించావ్..స్వామీ! నాకు.. మనశ్శాంతి లభించింది!" ఇష్టదేవతలకు లోలోనే ధన్యవాదాలు తెలిపిన అతని మనస్సు ఆనంద డోలికల్లో ఊగసాగింది.

"అరే..అనంతా!... నువ్వా! ఈ వేళప్పుడు యిక్కడున్నావేంటి?" రంగాచారి సంభ్రమాశ్చర్యాలతో కొడుకుపై ప్రేమగా చేయి వేశాడు.

"అతనేనా?..నీ బిడ్డ..రంగా!" బోగి నుండి దిగిన రెండో వ్యక్తి అనంతాచారి వైపు పరిశీలనగా చూడసాగాడు.

"అవును చిన్నాన్నా! వీడే నా కొడుకు! పేరు.. అనంతాచారి!" అన్న రంగాచారి కొడుకు వైపు తిరిగి "అనంతా! ఈయన మీ చిన్నతాత.. వెంకటాచారి!" అంటూ పెద్దాయన్ను పరిచయం చేశాడు.

"తా...తా!" ఒక్కసారిగా ఆశ్చర్యపోయిన అనంతాచారి వెంటనే తేరుకొని ఎదుటి వ్యక్తికి పాదాభివందనం చేశాడు. తెల్లజుట్టు, బుర్రమీసాలతో గంభీరంగా వున్న పెద్దాయన "చిరంజీవ! చిరంజీవ! నిన్ను కలవటం చాలా.. సంతోషంగుందిరా.. అబ్బాయ్!" అంటూ దీవించాడు.

ఆపై ముగ్గురు కలసి వెయిటింగ్ రూంకు చేరారు.

అక్కడ కుదురుగా కూర్చున్నాక అనంతాచారి "నాన్నా! ఇన్నాళ్లు.. ఏమైపోయావ్? అయినా.. ఏ సమాచారం లేకుండా అలా యిల్లు విడిచిపోతే మేమేమవ్వాలి? ఏ ఆచూకీ తెలియక ఇంటిల్లిపాది తల్లడిల్లుతుంటే, అందరిని నేనొక్కడ్ని ఎలా ఓదార్చాలి? ఇంట్లో యిలా వుంటే బయట లోకులు పలుకాకులై మాపై లేనిపోని అభాండాలేస్తుంటే..వాటినెలా భరించాలి? ఇక రాత్రింబగళ్లు ఎవరు తలుపు తట్టినా, సెల్‌ఫోన్ మోగినా.. అది నువ్వేననే భ్రమలో యిన్నాళ్ళు సాగదీశాం! మన గుడి పెద్ద శాస్త్రిగారు కూడ.. నీవు.. యింటినుండి వెళ్లటానికి కారణం.. మేమేనన్నట్లు అనుమానిస్తే.. అదీ భరించాం! చివరకు... ఉత్తర దిశన నీ తండ్రి క్షేమమేనన్న ఆయనగారి జోస్యాన్ని నమ్మి నిన్ను వెతకటానికి స్వయంగా నేనే ఎవరికీ చెప్పకుండా బయలుదేరా! మధ్యాహ్నం నుండి వెతుక్కుంటూ... ఇదిగో యిక్కడికి చేరి ద్రోణాచలం వరకు టిక్కెట్టు తీసుకొని రైలురాకకై ఎదురు చూస్తున్నా! ఇంతలో.. మీరు కనపించారు!" అంటూ విషయాన్ని ముగించి తండ్రి వైపు ప్రశ్నార్థకంగా చూడసాగాడు.

"చెప్తాన్రా.. అనంతా! అన్నీ చెప్తా! కాస్త ఓపిగ్గా విను! నా పూర్వీకుల సమాచారం మీ అమ్మవాళ్ళకు గాని, నీకు గాని తెలియదు! పైగా.. అది చెప్పవలసిన అవసరమూ తలెత్తకుండా చతురతతో యిప్పటివరకు జరిపించగలిగాను! కాని యిప్పుడు చెప్పక తప్పేలా లేదు!" రంగాచారి దీర్ఘ శ్వాస తీసుకొని చుట్టూ కలయ చూశాడు.

ఇక అనంతాచారి ఉత్సుకత తారాస్థాయినుంది.

"పుట్టుకతో తెలుగువారైన మా నాన్నవాళ్ళు చాలాఏళ్ళ క్రితం కర్నూలు ప్రాంతం నుండి కర్ణాటకలోని టుంకూరుకు వలస వెళ్ళి అక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. తొలుత చిన్న చిన్న వ్యాపారాలు చేసిన వాళ్లు, క్రమేపి మంచి స్థిరాస్తులే సంపాదించారు. సిరి సంపదలు పెరిగాక నాన్న, చిన్నాన్నలు వేరు పడ్డారు. నా పుట్టుకలో మా అమ్మ చనిపోయింది! ఆ పై నాన్న రెండో పెళ్ళి చేసుకున్నాడు! నా సవతి తల్లికి వరుసగా ముగ్గురు మగపిల్లలు గలిగాక ఆమెకు నాపై ప్రేమ తగ్గింది! అలా... అలా... చివరకు నన్ను వారి పిల్లకు పరిచారకుడిగా మార్చింది! మా నాన్నకివేమి పట్టేవి కావు! ఇక ఆ బాధ తాళలేక నేను ఒకరోజు బెంగుళూరు పారిపోయి, అక్కడ రైలెక్కి నేరుగా ఇదే రైల్వేస్టేషన్లో దిగి మన నరసింహగిరికి చేరా! ఆపై... అనాథనని చెప్పిన నా మాటను నమ్మి మీ మాతామహుడు నన్నాదరించి, ఆర్చకత్త్వం నేర్పి, మీ అమ్మనిచ్చి పెళ్ళి చేయటం, నీవు పుట్టటం మొదలైన విషయాలన్నీ... నీకు తెలిసినవే! అయితే ముఖ్యమైన ఘట్టము నీ పెళ్ళయ్యాకే మొదలైంది!" చెప్పటం ఆపిన రంగాచారి కొడుకు వైపు నర్మగర్భంగా చూశాడు.

"అదేంటి నాన్నా! నేను, నా భార్య మిమ్మల్ని బాగానే చూసుకుంటున్నామే!" అనంతాచారి అమాయకంగా చూశాడు.

**"మీతో కాదురా బాబూ! మీ పిల్లలతో సమస్య మొదలైంది!"**

**"వాళ్ళేం చేశారు నాన్నా! మీరంటే వాళ్ళకు అమితమైన ప్రేమగదా!"**

**"అదేరా... బాబూ! నా పలాయనానికి కారణం!"**

"అదెలా?" అనంతాచారి తెల్లముఖమేశాడు.

"మనుమలపై గల అపార ప్రేమ నాలో ఓ క్రొత్తప్రేరణకు కారణమైంది! అదే నా గతాన్ని, సిరి సంపదల్ని గుర్తుకు తెచ్చింది. దాంతో టుంకూరుకెళ్ళి వంశపారంపర్యంగా నాకు రావల్సిన ఆస్తి వశపరుచుకుంటే, నా మనుమళ్ళ మన కుటుంబ పరమైన అర్చక వృత్తితో గాక స్థితిమంతులుగా స్థిరపడ గలరనుకున్నా! అందుకే మీకెవ్వరికి చెప్పకుండా ఇల్లు విడిచి టుంకూరు చేరా! తీరా... అక్కడికెళ్ళి చూస్తే మా నాన్న, సవతి తల్లి కాలం చేసున్నారు! ఆస్తి పంచుకొని అనుభవిస్తున్న నా సవతి సోదరులు నాకేమి యివ్వమని మొండికెత్తారు. అప్పటికీ మా..ఈ చిన్నాన్న ఎంతో చెప్పి చూశాడు! ఊహూం! మూర్ఖులు... ససేమిరా అన్నారు! ఇక చేసేదేమీలేక తిరుగు ప్రయాణమయ్యా! అప్పుడు మా చిన్నాన్న కూడా మిమ్మల్ని చూడాలని బయలుదేరాడు! ఇక ఈ తతంగమంతా నడవటానికి నెలపైనే పట్టింది! ఒక్కసారిగా ఆస్తితో వచ్చి మిమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చెయ్యాలని నా ఉనికిని మీకు తెలియపరచలేదు! నా ప్రయత్నానికి మీరెక్కడ అడ్డు చెప్తారోనని సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశా! అలా మిమ్మల్ని బాధ పెట్టటం.. నా తప్పే!" చెప్పటం ముగించిన రంగాచారి... కొడుకు వైపు పరిశీలనగా చూడసాగాడు.

అప్పటికే కన్నీటి పర్యంతమైన అనంతాచారి "నాన్నా! మా పైన మా పిల్లలపైన మీకు గల ప్రేమానురాగాలే మాకు కోట్లాది ఆస్తి! అలాంటి మాకు ఇంకేదో తవ్వి తలకెత్తాలని కక్కిన కూటికాశించి ఎన్ని ప్రయాసలు పడ్డారు! చాలు నాన్నా... ఈ నెలరోజులు మేము అనుభవించిన నరకం...చాలు! ఎలాగైతేనేం... మీరు మాకు దక్కారు! వాస్తవానికి మీ దీవనలే మాకు వేనవేలు!" అంటూ తండ్రి పాదాలకు నమస్కరించి లేచి ఆయన్ను కౌగిలించుకొని బావురుమన్నాడు.

"ఛా! పిచ్చినాగన్నా! అలా ఏడుస్తావేం? అసలు మిమ్మల్ని వదిలి నేనెక్కడికి పోతానురా!" రంగాచారి వీపుపైగా తట్టి కొడుకును బుజ్జగించాడు.

ఆ తండ్రి కొడుకుల పరస్పరానురాగం చూసి చలించిన వెంకటాచారి, "ఒరే రంగా! ఇలాంటి కొడుకును గన్న నువ్వు ధన్యుడివిరా! అలాంటి నీకు వెధవ ఆస్తులెందుకురా? వాస్తవానికి మా టుంకూరు పిల్లలందరికంటే నువ్వే.. ధనికుడివిరా" అంటూ రంగాచారి భుజం తట్టాడు.

అప్పటికి తెల తెలవారి రాగరంజితమౌతున్న నంద్యాల తొలి ఉషస్సు వారిని తాకింది.



- షేక్ మస్తాన్ వలి
9440712591

# గురుబ్రహ్మ

కథ

దేవునిపల్లి అనే గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఒక తెలుగు భాషోపాధ్యాయురాలు సునీత మేడం. తను సరస్వతి దేవికి నిదర్శనం. తను పాఠాలు చెప్తే ఆ దృశ్యాలు మన కనుల ముందే ఉన్నట్టు అనిపిస్తుంది. తెలుగు భాషోపాధ్యాయురాలుగా పని చేస్తూ తను ఎన్నో కథలు కవితలు రాసింది. పురస్కారాలు, బహుమతులు చాలా సాధించింది. ఇలా అందరి దగ్గర మంచి పేరు పొందింది. అలా ఆమె జీవనం కొనసాగుతూ ఉంది. అలా కొన్ని రోజులకీ తనకు ఒక ఆలోచన వచ్చింది. అది కరోనా లాక్ డౌన్ సమయం. పాఠశాలలో అన్ని మూతపడ్డాయి. ఆ సమయంలో నేనే కాదు నాలా చాలామంది మంచి పేరు పొంది ఎన్నో పురస్కారాలు, బహుమతులు పొంది ఉత్తమ స్థాయిలో నిలవాలని అనుకున్నది. అప్పుడే తను ఆ చాలా మంది ఎవరో ఎందుకు కావాలి అదే నా విద్యార్థులు అయితే ఎంత బాగుండు అని అనుకున్నది. ఇక సమయం వృథా చేయకుండా పని మొదలుపెట్టింది. ముందుగా కొందరి పిల్లలకు ఫోన్ చేసి చెప్పింది. మీరు ఇప్పుడు ఖాళీగానే ఉంటున్నారు కదా అయితే మీరందరూ ఒక పని చేయాలని చెప్పింది. పిల్లలందరూ సరే మేడం ఏంటో చెప్పండి అని అన్నారు. అప్పుడు తను మీరందరూ మీ అమ్మ గురించి లేదా మీ నాన్న గురించి లేదా మీకు ఇష్టమైన వాటి మీద మీరు శతక పద్యాలు రాయాలి అని చెప్పింది. ముందుగా పిల్లలందరూ భయపడ్డారు. మీరు రాయగలరు అని ధైర్యం చెప్పి ఒప్పించింది. అప్పుడు పిల్లలందరూ సరే అని అన్నారు. అలా పిల్లలు కూడా పని మొదలుపెట్టారు. పిల్లలు కూడా తొందర్లోనే పని పూర్తి చేశారు. ఆ చిన్నారులను చూసి మురిసిపోయింది ఆ ఉపాధ్యాయురాలు. ఇలా ఇంతటితోనే ఆగకుండా ఇంకో ఆలోచన వచ్చింది తనకి.

ఈ పాఠశాల నుండి ఒక మంచి పిల్లల కథల పుస్తకం ఆవిష్కరిస్తే ఎంత బాగుంటుంది అని అనుకున్నది. పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. అప్పుడు తను స్వయంగా తరగతి గదులకు వెళ్లి పిల్లలు మీరు అందరూ మీకు నచ్చిన వాటి గురించి చిన్న చిన్న కథలు రాయండి అని చెప్పింది. అప్పుడు పిల్లలు కూడా తొందరగానే ఒప్పుకున్నారు. సరే మేడం అని చెప్పారు. ఆ విద్యార్థులు అలా పిల్లలు తొందరగానే పని పూర్తి చేశారు. ఆ చిన్నారులు రాసిన కథలను ఒక పుస్తక రూపంలో వెలువడించారు. ఆ పుస్తకం పేరు 'దేవునిపల్లి బడి పిల్లల కథలు'.అప్పుడు ఆ ఉపాధ్యాయురాలు మరియు ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం చాలా ఆనందించారు. నా పిల్లలలో ఇంత కల ఉందా అని చాలా ఆశ్చర్యపోయింది. అప్పుడే 75 వ స్వాతంత్ర వజ్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అప్పుడే కవి సమ్మేళనం ఉంది అన్న వార్త తనకి తెలిసింది. ఈ కవి సమ్మేళనంలో నా చిన్నారులు కూడా ఉంటే ఎంత బాగుందో అని అనుకున్నది. అలా అనుకొని పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి అమ్మాయికి ఈ విషయం చెప్పింది. ఆ అమ్మాయి మేడం నాతో ఈ పని కాదు అని భయపడుతూ చెప్పింది. అప్పుడు ఆ ఉపాధ్యాయురాలు ఆ చిన్నారికి ధైర్యం చెప్పింది. ఇలాంటి అవకాశాలు అందరికీ రావు. మనం అవకాశం వచ్చినప్పుడే సద్వినియోగం చేసుకోవాలని చెప్పింది. ఆ చిన్నారి అప్పుడు ఒప్పుకుంది. సరే మేడం నేను తప్పకుండా రాస్తాను, ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొంటాను అని చెప్పింది. అప్పుడు ఆ ఉపాధ్యాయురాలు సంతోషించింది. ఆ చిన్నారి కూడా ఎక్కువ రోజులు సమయం తీసుకోలేదు. త్వరగానే పని పూర్తి చేసింది. ఆ చిన్నారి ఆ కార్యక్రమంలో పాల్గొన్నది. చాలా చక్కగా ప్రదర్శన చేసింది. ఆ కార్యక్రమంలో తను తెలంగాణ సారస్వత పరిషత్ చేత బాల కవి పురస్కారం పొందింది. ఆ సమయంలో చిన్నారి సంతోషానికి హద్దులు లేవు. ఈ విషయం ఆ ఉపాధ్యాయురాలికి తెలిసింది. తను చాలా సంతోషించింది. నేను అనుకున్నట్టే నా విద్యార్థిని నాలా మంచి స్థాయిలో నిలిచింది అని మురిసిపోయింది. ఆ పాఠశాలలోని ఉపాధ్యాయులు చిన్నారులు కూడా ఆనందించారు. అలాంటి ఉపాధ్యాయురాలు ఉన్నందుకు అందరూ అదృష్టంగా భావించారు.

**నీతి:** గురువు అనే వాడు ఒక చదువు చెప్పడంలోనే కాదు పిల్లల్లో ఉన్న కలలు వెలికి తీసి వాళ్లని వెనుకుండి నడిపించగలిగే వాడే గురువు. ఆ చిన్నారి ఆ సమయంలో అలా భయపడి ఒప్పుకోకపోతే తను కూడా అందరిలానే మిగిలిపోయేది. అందుకే గురువు చెప్పిన మాట వినడం శిష్యుని లక్షణం. ఇలాంటి ఉపాధ్యాయులు అన్ని పాఠశాలలో ఉండాలని కోరుకుందాం.

**-బొమ్మెర అనీల**
10 వ తరగతి, జి.ఖ.ఉ.ా దేవునిపల్లి, కామారెడ్డి ఫోన్ నెంబర్: 9866202782

# సిద్ధప్ప శతకము

సిద్ధప్ప యనునీవు సిరివోలె జగతిన
శైవ చార్యుల వల్ల శరణు పొంది
ధర్మమే బోధించి దండిగా జనులను
భక్తుల చేసిన భవ్య చరిత
మోదమరల గాను బోధన చేసావు
ధర్మము తప్పని ధర్మ రాజ
బీదజనాలకు బిక్షము వేసావు
దాతగా వాసిని ధరణి నిల్ప

తేటగీతి:-
ధర్మ నిర్మాణ ఘనుడవు ధర్మ దాత
సత్య రూపుడా జనులకు జయము వీవు
మోద మివయ్య మదినినీడ మోము వెలుగ
సిద్ధి నొందావు సిద్ధప్ప శివుని భక్త.

భక్తితో వెలిగావు భవమందు తేరులా
లింగాల వంశాన లింగ ధారి
సత్యము నిలలోన నిత్య కల్యాణమై
వెలుగులు జిమ్మగా వెలసి నావు
అమృత వాక్కుచే నందంగ వరలితి
అంతటా వ్యాపించి నంద నంత
సంతోష సద్భక్తి సగుణాల రాసివి
భజనతో భగవంత బంధు వీవు.

తేటగీతి:-
మనము సంతోష సహనము మాకు బలము
శక్తి భక్తుల ముక్తికై జపము జేయ
భక్తి తోడను భజనతో బాధ్యతెరుగ
సిద్ధి నొందావు సిద్ధప్ప శివుని భక్త.

మనమున నిలకడ మానుగా చేశావు
జీవన విలువకు జీవ గడ్డ
పుణ్యాల పంటగా పురములో వెలిసావు
మాన్యుడ రావయ్య మమ్ము కావ
జడివాన సుడిగాలి జడుపులు వచ్చినా
జంకక బొంకక జనుల కండ
కూర్మిని పంచియు కూడెను జనులను
మదిలోన మక్కువ మరవ కుండ.

తేటగీతి:-
మనసు నెక్కడో యేమిటో మర్మ మేను
నటన చేసావు నిర్మాణ నటన విధము
కూర్మి నివ్వాలి మాకును పేర్మి తోడ
సిద్ధి నొందావు సిద్ధప్ప శివుని భక్త.

శాంకరీ యొడిలోన చల్లనీగ పవలించె
నందిగోత్రము లోన నంద నంద
కూర్మితో పెరిగావు పేర్మి వాడలలోన
ధరణిలో నిలిచావు దాత వలెను
మనుజుల మదిలోన మలుపులు తిప్పావు
సుద్దులన్ బుద్ధిలన్ శుద్ధి చేయ
మనుషుల నందరి మదిలోన వుంచావు
బాధల భారము పార ద్రోల.



-దేవనపల్లి ఓగన్న
7972289784

# అలసిపోని అజాతశత్రువు

చెమట చుక్కలతోటి పుడమిని తడిపేసి
అవనిపై పచ్చదనాన్ని అలుకుతాడు
ప్రాణమంతా పైరు పైనే పెట్టేసి
ఆశల తీగలను అల్లుకుంటాడు
ఎండిన డొక్కలను ఎగదోసుకుంటూ
బురద నుండి బువ్వను తీసే రైతన్న
నేడు దుఃఖ నదిని ఈదుతున్నాడు.
గ్రీష్మంలో వరుణుడు వడగండ్లతో
ఇర్సకపడతాంటే రైతన్న దిగులు పక్షి లా
దిగాలుగా చూస్తున్నాడు
ఆరుగాల కష్టమంతా కళ్ళెదుటే
జల సమాధి అవుతుంటే చంటి పిల్లాడి లా
గుక్క పట్టి రోధిత్తాండు
ఒంటి మామిడి చెట్టయి
సహాయపు పరిమాళాల కోసం అచేతనంగా ఆకాశం
వైపు చూస్తున్నాడు
చినుకు పడితే చాలు తనువంత చిత్తడై
చిగురుటాకులా వణికిపోతాండు.
తరాల నుండి వాళ్ల తలరాతలు మారట్లేదు
సబ్బు బిల్లోడు ,అగ్గి పుల్లోడు, నీళ్ళసుక్కోడు
దర్జాగా ధరలు నిర్ణయించుకుంటాంటే
ప్రపంచానికి పట్టెడన్నం పెట్టే రైతన్న మాత్రం
పరాన్న జీవి యై పాకుతున్నాడు
గాసమంతా గంగపాలవుతుంటే
కర్షకుడు అప్పుల కుహరంలోకి కూరుతున్నాడు.

నకిలీ విత్తనపోడు నట్టేట ముంచినా
పురుగు మందులోడు పుట్టి ముంచినా
ఎన్నుకున్న ఏలికలు ఎడారిలో వదిలేసినా
కాలం కసిగా ఎన్ని గాయాలు చేసినా
రైతన్న కొత్త పొద్దయి ఉదయిస్తూనే ఉంటాడు
భవిత కోసం వ్యూహాలను రచిస్తూ
కొత్త కథలను రాస్తూనే ఉంటాడు
అతను అలసిపోని అజాతశత్రువు



-తాటిపాముల రమేష్
7981566031

# మాతృ ప్రేమ

కథ

మాతృప్రేమ ముందు ఈ సృష్టిలో ఏ శక్తీ నిలువలేదు.శివాజీ రాయగఢ్ కోట శత్రువులకు అభేద్యంగా కట్టుదిట్టంగా ఉండేది.ప్రొద్దున ఆ తింటికి తెతిచిన కోట తలుపులు రాత్రి తొమ్మిదిగంటలకు మూయబడుతాయి. ద్వారం మూసి ఉన్న సమయంలో చీమకూడా లోని నుండి బైటికి వెలుపల నుండీ లోనికి రాకూ డదు.ఇది ఛత్రపతి శివాజీ ఆజ్ఞ!రాజ్య రక్షణార్థం ఇట్టి కట్టుదిట్టాలు తప్పలేదు.ఎట్టి పరిస్థితులలో నూ రాత్రి తొమ్మిది తరువాత కోట ద్వారం తెరవబడదు.హీరాకానీ' అనే గ్రామవాసి రోజూ కోటలో ఉన్న అధికారులకు, సైనికులకు పాలుపోయటానికి వచ్చేది.అందటికీ తనకు చేతనైన సహాయం చేసేది.ఇలా ఉండగా ఒక రోజు సాయంకాలం పాలుపోయటానికి కోటలోకి వచ్చింది హీరాకానీ. ఒక సైనికుడి భార్య ప్రసవవేదన పడుతున్నదని తెలిసి అక్కడే ఉండి ఆమెకు సహాయం చేసింది. పురుడు అయ్యేదాకా అక్కడే ఉన్నది. ఇంటికి వెళదా. మని సమయంచూస్తే తొమ్మిది దాటిపోయింది.

పరుగులుతీసి కోటగుమ్మం చేరింది హీరా కానీ.

కావలి వాళ్ళు హీరాకానీ చాలా మంచిది అని అభిమానం ఉన్నా రాజాజ్ఞ ధిక్కరించలేక తలుపులు తీయలేదు.అయ్యో! ఇంట్లో ఉన్న పసిపిల్లవాడికి ఆకలివేస్తుంది. వాడికి పాలి వ్వాలి'' అని ప్రాధేయపడింది.హీరాకానీ మీద జాలి పడిన కావలి వాళ్ళు "తల్లీ రాజాజ్ఞ మేము మీఅలేము. ఈ ఒక్క పూటకి ఈ సైనికుని ఇంట్లోనే పడుకో. ఉదయం అవ్వంగానే నిన్ను మేమేస్వయంగా పంపిస్తాం అనిఊఅడించినారు.మఖునాడు ప్రొద్దురాగానే కావలివాళ్ళు హీరా కానీని వెదకసాగారు. ఎక్కడైనా ఆదమఱచి నిద్రపోయిందేమో లేపి ఇంటి కి పంపుదా మనుకున్నారుఅలా వెదుకుతున్న వారికి కోటగోడ వద్ద హీరాకానీ పాల పెరుగు కుండ కనిపించింది.పైకి చూసేసరికి ఆమె పూసల గొలుసు కోటమీద రాయికి వ్రేలాడుతూ కనిపించింది.ఆశ్చర్యపోయిన కావలివాళ్ళు శివాజీకి ఈ విషయం విన్నవించారు.ఒక స్త్రీ అభేద్యమైన కోట అర్ధరాత్రి ఒంటరిగా దాటడమా? అది ఎలా సాధ్యం అని నివ్వెరపోతూ స్వయంగా పరిస్థితిని పరిశీలిద్దామని అక్కడికి వచ్చాడు శివాజీ.ఇంతలో 'హీరాకానీ' రానేవచ్చింది. వణుకుతూ శివాజీ ముందు నిలబడి "అయ్యా! రాత్రి పాలకై ఏడుస్తున్న నా బిడ్డడు గుర్తుకు వచ్చాడు. ఇక ఏ దారీ తోచలేదు. కోటగోడలెలా దాటానో నాకే తెలియదు. కొండలూ గుట్టలూ తుప్పలూ ఆ నడిరాత్రి ఎలా దాటానో కూడా తెలియలేదు. నా బిడ్డ ఒక్కడే నాకు జ్ఞప్తిలో ఉన్నాడు. నా తప్పు క్షమించండి ప్రభూ!" అని ప్రార్థించింది హీరాకానీ.శత్రువులకు సింహస్వప్నమైన ఛత్రపతి కళ్ళు చెమ్మగిల్లాయి. 'హీరాకానీ'కి అందఱూ చూస్తుండగా సాష్టాంగ వందనం చేశాడు! "అమ్మా! మాతృప్రేమ ముందు ఈ సృష్టిలో ఏ శక్తీ నిలువలేదు. ఇక ఈ కోటగోడలెంత? ఇక్కడ కట్టబోయే బురుజుకు నీ పేరే పెడతాను" అని ఆమెను పంపివేశాడు అమ్మ విలువ తెలిసిన శివాజీ.ఇప్పటికీ ఈ బురుజు 'హీరాకానీబురుజు' అనే పిలవబడుతోంది.



-వి.శేషారావు
9440408080

# కదిలే మబ్బులు

ఆకాశాన్ని చూస్తే
మబ్బులు గుర్తుకొస్తాయి
మబ్బులు కదిలి తిరుగాడితే
ఆశలు కొత్తగా చిగురిస్తాయి.

కొన్ని చినుకులతోనే
సరికొత్త రూపం భూమిని అల్లుకొంటుంది
కొన్ని కలలు పలకరిస్తాయి
మరికొన్ని వ్యధలు దగ్ధమౌతాయి.

ఆకాశం..నేల..,కొన్ని మబ్బులు..,
కర్షకునికి ఆత్మీయ వారదిలానే నిలుస్తుంది
శ్రమతో కూడిన చైతన్యం చరిత్రను తిరగరాస్తుంది
రైతుకు చినుకు ఒక ఒదార్పు
దేశానికి పంట కల అనిర్వచనీయ రూపం.

విత్తులు ఆరాటపడుతున్నాయి
నేలతో చెలిమి కోసం
అదిగో తూరుపు గాలి తచ్చాడింది
ఆకాశం నల్లబోయింది
కదిలే మబ్బులు నిలబడ్డాయి
చినుకు మెల్ల మెల్లగా
రైతు పాటను అందుకొంది
కొత్త చరణం
రైతు కళ్లలో ఆశలు
మిల,మిలా మెరుస్తున్నాయి



-మహబూబ్ బాషా చిల్లెం
9502000415

పుస్తక సమీక్ష

# "చిత్తగించరయ్య సీతమాట" డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి

డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి తనపద్య కావ్యంలో "చిత్తగించరయ్య సీతమాట" మకుటంతో తెలుగు భాష, విద్యార్థుల పోరుబాట, స్త్రీ ఔన్నత్యం దిగజారిన విలువలు, రైతుల గురించి వైవిధ్యభరితంగా తన భావాలను పద్య రూప కంగా సమాజ హితాన్ని, ఆకాంక్షించారు. ద్విశతిలో, కవయిత్రి డా॥సీతా లక్ష్మి, బయట సమాజ స్థితిగతులను చూసి, స్పందించిన తీరుతెన్నులు పద్య సుమాలుగా వికసించాయి. "సెల్లుఫోను ఎప్పుడు చింతలే పెంచును, ఫేసుబుక్కు తెరువ ఫేసుక్కుంగు",

**"ఎపుడు ఏదొ మెసెజు ఏమేమొ పంపును**
**తెలియకున్న తాను తెలిసినట్లు**
**భంగపడియు చివర బాధ పడునెపుడు"**

అంటూ

సెల్‌ఫోన్ మేసెజ్‌లు, మాటలు, ఆడపిల్లలో అమాయకత్వంతో మోస పోవడం, యువత ప్రస్తుత నడవడికను కళ్ళకు కట్టించారు.

**"వాయుధర్మమెపుడు వీయునేమైనను**
**అగ్నిధర్మ నిరతి ఆగదెపుడు"**

అంటూ ధర్మాన్ని ఆచరించాలనే జీవిత సత్యం వివరించారు.





**'కూలిపోయిన కూలిరైతు బతుకు, 'తిండి పెట్టు రైతు తిండిలే కేడ్చును',** పంట పాడుగాగ పగిలెరైతుకు గుండె' అంటూ 'అన్నదాత బ్రతుకులాగమై పోయెను', అప్పుతీర్యలేక ఆవిరాయెను బ్రతుకు', అన్నదాతల ఆత్మహత్యల జీవన విషాదాన్ని చిత్రీకరించారు. అమ్మలేనిలోకం అడవి అని, ఆమె మట్టి బొమ్మ కాదని అంటూ

"తల్లి నీసడించు తనయుడు నీచుడు" అమ్మదనములోని కమ్మదనము,అమ్మ కరుణలేక అసలేది సాగదు" అంటూ అమ్మపట్ల అనురాగం, అద్భుతంగా ప్రదర్శించారు. "తెలుగువాడ ననుచు తెగువతో చెప్పరా" "తీయనైన పాట తెలుగుమాట" అంటూ మాతృభాషను ప్రస్తుతించారు. సమాజహితం కోరుతూ చక్కని నీతి శతకాన్ని ప్రస్తుత కాల, మాన పరిస్థితులను. మానవ నైజాన్ని జీవిత సత్యాలుగా రచించిన 'సీతమాట' అభినందనీయం.

**ప్రతులకు:**డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి
అశ్విని ప్రచురణలు
ప్లాట్ నెం.30
హస్తినాపురం సెంట్రల్ ఫేస్-1
వైశాలీనగర్ పోస్ట్
సాగర్ రోడ్
హైదరాబాద్-500 079
సెల్: 9440720324



-జయసూర్య
సెల్:9014948336

# నాగికథలో మనస్తత్వ చిత్రణ-తెలంగాణా మాండలికాలు



**" తెలంగాణా గ్రామీణ నుడికారాన్ని మాండలికాన్ని ఒడిసిపట్టి భాషామాధుర్యాన్ని పాఠకులకు రుచి చూపించారు. అదే క్రమంలో ఆకాశవాణిలో తెలంగాణా మాండలికంలో ప్రసంగం చేసిన తొలి రచయిత్రి కూడా పాకాల యశోదారెడ్డి. ఆగష్టు 8 జయంతి సందర్భంగా యశోదారెడ్డి రాసిన కథపై తిరునగరి దేవకీదేవి విశ్లేషణ"**

యశోదా రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి గ్రామానికి చెందిన రచయిత్రి. ఈమె వందకు పైగా కథలు రాసినప్పటికి కేవలం 63 కథలు మా ఊరి ముచ్చట్లు (1973) ఎచ్చమ్మ కథలు (1999)ధర్మశాల (2000) మూడు కథాసంపుటాలుగా వెలువడ్డాయి. మా ఊరి కథలు 1920 నుండి 1940 నాటి తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రీకరిస్తే ఎచ్చమ్మ కథలు 1950 నుండి 1970 ల కాలంలోని తెలంగాణా సంస్కృతికి ప్రతీకలుగా నిలిచినై. ఇక ధర్మశాల కథలు 1980 నుండి 1990 లలో సమాజంలో వచ్చిన మార్పులను ముందుకు తెచ్చినవి. మొత్తంగా సాహిత్యం సమాజ దర్పణం అన్న విషయాన్ని యశోదా రెడ్డి కథలు నూటికి నూరు పాళ్ళుగా ఋజువు చేస్తాయి. ఊరికి ఉయ్యాలో ,భావిక అనే కవితా సంపుటాలు కూడా ఈమె కలం నుండి వెలువడినవి. ద్విపద వాఙ్మయము, ప్రబంధ వాఙ్మయము, భారతీయ చిత్రకళ, భాగవత సుధలు వీరి పరిశోధనాత్మక గ్రంథాలు. అంతే కాకుండా కులశేఖర్ రావు కలిసి కావ్యానుశీలనం వట్టికోట ఆళ్వారుస్వామి, సి నారాయణ రెడ్డి గార్లతో కలిసి చిరు గజ్జెలు రచనలను పాఠకులముందుకు తీసుకొచ్చారు. అంతేకాకుండా పారిజాతాపహరణం, ఉత్తర హరివంశం, తెలుగు సామెతలు, ఆంధ్ర క్రియాద్వీపమణి దీపిక మొదలగు పుస్తకాలకు సంపాదకత్వం వహిస్తూ వాటికి విలువైన పీఠికలు రాసారు. తెలంగాణా గ్రామీణ నుడికారాన్ని మాండలికాన్ని ఒడిసిపట్టి భాషామాధుర్యాన్ని పాఠకులకు రుచిచూపించారు. అదే క్రమంలో ఆకాశవాణిలో తెలంగాణా మాండలికంలో ప్రసంగం చేసిన తొలిరచయిత కూడా ఈమెనే.

## నాగి కథా వస్తువు:

హైదరాబాద్ లో రామిరెడ్డికి చదువు ముగిసింది. చదువుతోపాటు కిక్కిరిసి పోయిన పట్నం యాంత్రిక జీవితంతో విసిగిపోయి గ్రామానికి చేరుకున్నడు. గ్రామంలో పచ్చదనపు పర్యావరణం ఆ పల్లె జీవితం ఆయనకు ఎంతో తృప్తినిచ్చింది. ఒకరోజు ఊరబాయికి పోయి ఈతకొట్టి వంక దరిపట్టుకొని చూస్తే ఆయన పొడి దోతి కనబడ లేదు. చుట్టూత కలియచూస్తె ఒక ఆడపిల్ల దాన్ని కట్టుకొని కిలకిలా నవ్వుతూ కనపడుతుంది. రామిరెడ్డి కోపంతో ఆ పిల్లను చెంపపెట్టు పెట్టడంతో ఆమె ఆ దోతిని విప్పి పాత పేలికను కట్టుకొని వెళ్ళిపోతుంది. అట్లా వెళ్ళిపోయిన అమ్మాయి పేరు నాగి. ఆమె ఆ ఊరి గొల్ల సాయి మల్లిల బిడ్డ. ఏదో విషపురుగు కాటుతో సాయి చనిపోతాడు. గంపెడు పిల్లల సంసారాన్ని ఈదడం మల్లికి పెద్ద పరీక్షే ఐంది. జెట్టమీద రోకటి పోటులా కులకట్టుబాటుల కారణంగా పదేండ్ల బిడ్డకు పెళ్ళి చేయాల్సిన పరిస్థితిలో ఉన్న నాలుగు గొర్రెలను అమ్మి పెళ్ళి చేసింది. దాంతో ఆమెకు బతుకుదెరువు కష్టమైంది. కూలికి ధాన్యం దంచపోతే చుట్టూత చేరిన ఆమె పిల్లలు చాలా ధాన్యాన్ని ఎవరి కంటబడకుండా బుక్కేవాళ్ళు. దాంతో ఆసాములెవ్వరూ ఆమెను కూలికి పిలువడం మానుకున్నారు. పిల్లలకు అన్నమో రామచంద్రా అనే పరిస్థితి వచ్చింది. ఆ పిల్లలలో ఒకతైన నాగమ్మ అలియాస్ నాగి రకరకాల దొంగతనాలతో పాటు దౌర్జన్యంగాను కడుపు నింపుకోవడం మొదలు పెట్టింది. అందువల్ల నాగిని గత్తరను, మర్నాగిని చూసినట్లు భయపడే వారు. మర్నాగి నామకరణం కూడా చేసిన్రు. దోతి సంఘటన జరిగిన మరునాడే నాగి రామిరెడ్డి ఇంటి మొక్కజొన్న పెరట్ల పడి కంకులు ఇర్సుకొని తినుకుంట వాళ్ళ గుమస్తా చేతకి దొరికింది. ఆగుమస్తా నడీపుల గుద్దుకుంట రాంరెడ్డి దగ్గరికి ఈడ్చుకురావడంతో తనకు కడుపునిండా తిండి దొరకనందువల్లే దొంగతనం చేయవలసి వస్తుందన్న విషయాన్ని విడమరిచి చెప్తుంది నాగి.

రాంరెడ్డి "కూలిజేస్క బతుకరాదె" అన్న సలహా ఇవ్వగానే " దొరో! పొట్టల ఎలుకలు పొర్లుతుంటె కూలి ఎట్ల చేస్త. ...." తన పరిస్థితిని పూర్తిగ విప్పి చెప్తది .ఆమె పరిస్తితిని మొత్తం అర్థం చేసుకున్న రాంరెడ్డి ఎందరు వద్దని సలహా ఇచ్చినా నాగి అడిగినట్లు మొదలు కట్టుకోను బట్ట ఇచ్చి, కడుపు నిండ తిండి పెట్టి తన దగ్గర పనికి కుదుర్చు కుంటడు. నాగికి ఇక దొంగతనంతో పని లేకుండ పోయింది. మనిషి ఆరోగ్యవంతంగా తయారైంది. పనిలో నాగికి పోటీకి ఎవరూ రానంతగా చేసు కుంటూ పోయింది. ఒకప్పుడు నాగిని అసహ్యం చుకున్న జనం ఆమెను లోబరచుకోవడంలో విఫలురయ్యారు. చేతకు తగ్గట్టే కాదు అంచనాకు మించి చేతికొచ్చింది. ధాన్యం బండ్లు ఇంటికి వస్తున్న రోజు జోడెద్దులకు గానుగ పిండి పెట్టున్న నాగికి కరణం పంతులు మోసపూరిత చర్యలను పసిగట్టి అతను దొర ధాన్యాన్ని తన ఇంటికి మర్లించకుండా అడ్డుకుంటది. ఈ విషయాన్ని గమనించి గింజల విషయం ఏమైనా నాగిలో తను మార్పును తీసుక రాగలిగినందుకు చాలా తృప్తి పడతాడు దొర.

> **"కడుపు నిండిన వాళ్ళకు ఆకలిగొన్నవాళ్ళ పరిస్థితి ఎప్పటికీ అర్థం కాదనే వాస్తవాన్ని మనం గమనించాలి"**

## విమర్శ:

నాగి తండ్రి సాయికి గొర్లు మేపుకోవడం మినహా వేరే పనులు తెలియదు. సాయి చనిపోవడం తో నాగి తల్లి మల్లి ఒక బిడ్డ పెండ్లికి ఉన్న గొర్రెలను అమ్మింది. తినే పిల్లలు చాలా మంది. కూలీ చేయగలి గింది ఒక్కతే. అందువల్ల పిల్లలకు ఆకలి తీరేది కాదు. పిల్లలంతా తల్లి (పటేలు పట్వారీ ఇండ్లల్ల ధాన్యాన్ని దంచుతున్నపుడు **"అవి వడ్లైనా . అర్కెలైనా .అద్దశేరు గింజలు నోట్లె గుమ్మరి చ్చుకోని పరపర బర్పటిచ్చి మింగెటోళ్ళు. ఇంగ న్యాల శనక్కాయ (వేరు శనగ/ బుడ్డలు/ పల్లీలు) ఏరవోయిందంటే నాగమ్మ ఆరగింపు చేస్తదని..కండ్లుండగనే కంట్లె పాపను తీసెటంతటి బంటు దొంగ నాగి"** అని నాగికి పేరు పడ్డది.దాంతో మల్లిని ఎవరూ కూలికి పిలువడం మానుకున్నరు.

రచయిత్రి మల్లి పిల్లలు ధాన్యం దంచే దగ్గర అద్దశేరు గింజలు బర్పటిచ్చేటోళ్ళని చెప్పడంలో వాస్తవముండొచ్చు. కాని అద్దశేరు ఆమె పిల్లలంతా కలిసి తిన్నరు. పిల్లలు వడ్లను అరికెలను కూడా నమిలే వాళ్ళని చెప్పడంలో పొట్టుతో ధాన్యాన్ని ఎట్లా తినగలిగారని పాఠకులకు ఆశ్చర్యం కలుగక పోదు. కడుపు నిండిన వాళ్ళకు ఆకలిగొన్నవాళ్ళ పరిస్థితి ఎప్పటికీ అర్థం కాదనే వాస్తవాన్ని మనం గమనించాలి. పిల్లల సంఖ్యే కాదు ఆకలిగొన్న రోజులూ ఎక్కువే వాళ్ళకు. అద్దశేరు ధాన్యాన్ని తినడం యజమాని పెద్దమొత్తంగా చూస్తాడు. వాస్తవంగా వాళ్ళకు ఆ ధాన్యం ఆకలి తీర్చి ఉండక పోవచ్చు.

రాంరెడ్డి దొడ్లెకు గోడదుంకి రెండు కంకులు తిన్నందుకు గుమస్తా రంగయ్య అణగవట్టి తిట్టుకుంట గుద్దుకుంట గొరగొర గుంజుకొచ్చినపుడు రాంరెడ్డికి దొంగతనం చేసిందనే ఉద్దేశంతో ఆ నాగి మీద కోపం వచ్చింది. అసహ్యం కలిగింది. దొంగతనం చేసి బతుకెటోల్లకు బూమ్మీద బతికే హక్కు లేదన్న ఉద్దేశంతో

**"ఏం రోగం నీకు. నింద తిని కోడి కుయ్యక ముందే దొంగతనానికి మొదలైనావ్? ఆడిపోరివి గదా మొగోణివన్నకాదు. సిగ్గులేదె"** అని చెడామడా తిడ్తడు. ఈ తిట్టడంలో క్రితంరోజు ఈత కొట్టడానికి పోయినప్పుడు తన దోతి కట్టుకున్నదన్న కోపం కూడా ఉన్నది. రాంరెడ్డి నోటివెంట ఆడిపోరివి అనే మాట వచ్చేంత వరకు నాగికి తను ఆడిదో మొగోడో అనే విషయం నాగికి తెల్వలేదని రచయిత్రి మాట. అంటే ఆకలి తీర్చుకోవడంలో భాగంగా మొగ పిల్లల జత కట్టింది. ఆమెకు సమస్యల్లా ఆకలి. అదే తీవ్రమైన సమస్య. ఆ సమస్య తీర్చుకోవడంలో భాగంగా గుళ్ళె జొరబడి అయ్యగారు ఆరగింపు చేసి అక్కడిక్కడ పడేసిన బలిముద్దలు తెచ్చుకొని తినడం..రాగిచెట్టుకింద భక్తులు కొబ్బరికాయ కొట్టి దక్షిణకని ఏసిన పైసలు ఎత్తుక పోయి బెల్లం కొనుక్కొని తినడం..తాటి చెట్టుకు ఎగబాకి ఈడ్గి ఎల్లప్ప కట్టిన కల్లు లొట్టిని కతం పట్టిచ్చుడు.. సీతవల్క పండ్ల కాలంల గుడ్ల గుడ్ల పండ్లను



సాఫ్ పట్టించుట ... ఒకటా రెండా చింత చిగురు..ఓనగాయలు..చింతకాయలు ..సమస్తం తో తన ఆకలి తీర్చుకునే ప్రయత్నం చేసింది. అంతే కాదు. ఆకలి మంటకు పెరుగు ముంతలు నెత్తిన పెట్టుకొని అమ్ముకుంటూ పొయ్యేవాళ్ళ కండ్లల్ల మట్టికొట్టి ఆ పెరుగు ఎత్తుక పోయి తాగేది.

నాగి దొంగతనాలు వింటుంటే ఆమె చెయ్యి తిరిగిన దొంగ అని ఊళ్ళో జనానికి చాలా నష్టం చేసిందనే అభిప్రాయం కలుగక మానదు. కాని అట్లాంటి పనులు ప్రతి రోజు కాదనే చెప్పాలె. ఏది దొరుకన్నాడే పెరుగుదుత్తలమీద పడేదని రచయిత్రే చెప్తున్నది. ఈ ఆకలి తీర్చుకోవడమే పెద్ద సమస్య ఐన నాగికి రాంరెడ్డి "ఆడిపోరివి సిగ్గులేదే" అనేంత వరకు ఆ విషయం మీద సోయే లేదు. అంటే ఆమె ఆకలి తీవ్రత చెప్పకనే తెలుస్తున్నది.

**"నిండదిని కోడి కుయ్యకముందే దొంగతనానికి మొదలైనావ్ "** రాంరెడ్డి అన్న మాటకు

**"అవద్దం. నేను కడ్పునిండ తిన్ననంట. యాడదిన్న? ఎప్పుడుదిన్న? నాకు బువ్వ యాడుండది?"** అని తనమనసులోనే గుణించుకొని

" దొర నాకు నిన్న గూడంగ ముంజకాయలు దొర్కలేదు. ఉపాసం పండుకుంటె కడుపుల ఒకటే గోకుడు మంట. అందుకే ఇంటెన్క గోడ దుంకి మక్కజొన్న సేన్లవడి రెండు కంకులు నవిల్న ." అన్న ది నాగి . నిజమే రామిరెడ్డి బావిలో ఈత కొడ్తున్నపుడు అక్కడి తాటి ముంజలు తెంపుకోవడానికి వచ్చిన నాగి తన ఒంటిమీదున్న పాతపేలికను ఇడిసి ఆయన దోతి చుట్టుకున్నది కాని అక్కడే ఉన్న ఖరీదైన చేతిగడియారం ముట్టలేదు. కారణం అవసరానికి మించి నాగి ఏమి ఆశించలేదు. ఐనా రాంరెడ్డి చెంపదెబ్బ ఆ దోతి లేకుండా చేయడమే కాదు. ముంజకాయల ప్రయత్నాన్ని విఫలం చేసింది. అంటే ఆమె ఆకలికి పరోక్షంగా రాంరెడ్డి కారణం అనే విషయం నాగి చెప్పకనే చెప్పింది.

పల్లెజనం పట్ల ఆత్మీయత హేతుబద్ధత కలిగి పల్లెలో ప్రశాంతంగా జీవించాలని వచ్చిన రాంరెడ్డికి నాగి ఆకలి మాటలు వినగానే తల తిరిగింది. ఆకలికి దొంగతనం చేయడమెందుకు? కూలీ పని చేస్తే దొరికిన పైసలతో ఆకలి తీరుతది కదా? అని ఆలోచనతో

"నాగీ కూలీ జేస్క బతుకరాదే?" అనే సలహా ఇస్తడు. ఈ సలహా నాగికి చెట్టు ముందా? విత్తనం ముందా ? " అన్నట్లైంది. ఊళ్ళో నాగి చేసిన ఆకలి దొంగతనాల వల్ల మర్నాగి పేరు మోసింది. దొంగకు కూలీ దొరుకదు. కూలీ లేక ఆకలి దొంగతనం దారి చూపుతది.ఆకలి తీరే మార్గముంటే దొంగతనం అవసరముండదు. అదే మాట రాంరెడ్డితో

"దొరో పొట్టల ఎలకలు పొర్లుతుంటె కూలీ ఎట్ల జేస్త. మంట సల్లవడెనికె యాదమ్మ తింటె దొంగనాగినని నాకు పని ఎవ్వరు జూపరు. కూలి నూకలో కుచ్చపు దుడ్లో తేకపోతె మాయవ్వ గంజి పొయ్యదు. బువ్వ గంజి అని ఏడిస్తే నీకు మారెమ్మవట్ట. నీ కుంపటి పాడుగాను. నీకు గత్తరగట్ట పోను.పో! బిచ్చం ఎత్కపో అంటది. కూలి ఇయ్యనోళ్ళు బిచ్చెం ఎవ్వరిస్తరు? ఐనా బిచ్చెం నాకు ఇకారం అనిపిచ్చింది. అందుకే బీరదు నేను కలిసి ఈ పని నేర్సుకున్నం." అన్న నాగి అన్న మాటలలో ఆమె దొంగతనం చేయక తప్పని పరిస్తితి స్పష్టంగా కనిపిస్తున్నది. బిచ్చానికి పోయి అందరి చీదరిం పులు తిట్లు తినడంకన్నా దొరికింది తినడమే మేలనుకొంది. ఈ చర్య ఆలోచనలో ఆత్మాభిమానం స్పష్టం .

నాగి మాటలు ఇన్నాళ్ళు పాడిపంటలతో విలసిల్లాల్సిన పల్లెసీమల దారిద్ర్యానికి బాధపడ్డ రాంరెడ్డి నాగి పరిస్తితిని అర్థం చేసుకున్నడు. తనే పని ఇవ్వడం వల్ల నాగి ఆకలి తీరడమే కాదు దొంగతనం మార్గం నుండి తెప్పించి మంచి దారిలో పెట్టవచ్చు. అనే నిర్ణయానికి వచ్చి అనుకున్నట్లే పనికి కుదుర్చుకుంటాడు.

నాగికి ఆ ఇంట్లో పని తోపాటు తిండి దొరికింది. దొంగతనం చేయాల్సిన అవసరం రాలేదు. పుష్టిగా బొద్దుగా తయారైంది కూడా.ఆ తిండే రాంరెడ్డి ఇంట్లో రెక్కలు దాచుకోకుండా సవ్యంగా పని చేయించింది. పంట కూడా అంచనాకు మించి వచ్చింది.

ఈ కథ ద్వారా రచయిత్రి యశోదా రెడ్డి గ్రామీణ దోపిడీదారౌ?లకు మంచి చెంప పెట్టు వంటి సందేశాలనిచ్చింది. మనుషులను మంచి చెడులుగ తీర్చి దిద్దేది పరిస్తితుల ప్రభావమే కాదు. సమాజం కూడా. నాగి దొంగగా మారడానికి 1. తండ్రి చనిపోవడం. 2. గంపెడు పిల్లలుండటం. 3. సమాజం దండుగ విధిస్తుందన్న భయంతో తల్లి అనివార్యంగా ఉన్న గొర్రెలను అమ్మి పదేండ్ల పిల్లకు పెళ్ళి చేయడం ఈ పరిస్తితి లో తల్లితో కూలీ దగ్గర పిల్లలు ఆకలి తీర్చుకునే ప్రయత్నం.4. ఆ ప్రయత్నం వాళ్ళపై దొంగ ముద్ర వేయడం.5. ఆ దొంగ ముద్ర కూలీ లేకుండ చేయడం.6. కూలీ దొరక్కపోవడం తప్పని సరిగా ఆకలి తీర్చుకోవడంలో భాగంగా దొంగగా మారిన పరిస్తితి.

ఆ తర్వాత నాగి ఆకలి తీరింది. దొంగతనం మానింది. ఒళ్ళొంచి పని చేసింది. పుష్టిగా తయారైంది.

ఇక్కడ సమాజాన్ని కూడా గమనించాలి. రాంరెడ్డి దొర పెరట్లో కంకులు తిన్న నాగిని గుమస్తా రంగయ్య దొరుకబట్టిచ్చి " అమ్మా ! నా కండ్లల్లనె కారం గొడ్తవు . ఇయ్యాళ్ళ నీ తోడ్కలు తీస్త. నీ బొక్కలు సున్నం జెయ్యకుంటె సూడు. బద్మాష్ ముండ. లంబడి దయ్యం" అని తిట్టినోడు

రాంరెడ్డి ఇంట్ల నాగి పని కుదుర్చుకుంటున్న సందర్భంగ " అమ్మో మొండి ఘటం.దొమ్మరిసాని కుదురుగ కూసోని పని చేస్తాది? ఇదెక్కడది మనింట్ల ఇముడ్తాది? తోడ్కెలు తీసి ఎళ్ళ దన్నుండి." అన్న రంగయ్యనే పొలం నుండి వస్తున్న ధాన్యం బండ్లను కరణం ఇంటికి పంపించే ప్రయత్నం చేయడంలో ఆలోచించాల్సిన విషయమేంటంటే ఇక్కడ నాగి దొంగనా? కాదా? అని. నాగి దొంగతనంగా కంకులు తిన్నది నిజమే. కాని ఆ దొంగ తనం ఆకలిని తట్టుకోలేక చేసింది. ఆకలిని తీర్చ గలిగిన పని రాంరెడ్డి ఇవ్వగానే ఆ దొంగతనం జోలికి పోలేదు. పైగా ఆఇంటి సొత్తును కాపలా కాసింది. కాని తిండి పొట్టకు లోటులేని కరణం ఇంటికి తృణమో ఫణమో ఆశించి ధాన్యంతో బర్తీ ఐన బండిని పంపించే ప్రయత్నం చేసిన రంగయ్య...ఆ బండి ధాన్యాన్ని కాజేయాలని చూసిన కరణం అసలు దొంగలు . ఆ విషయాన్ని ఎత్తి చూపుతూ రచయిత్రి

"గుళ్ళెవుండి గుడాలాలు మింగినట్లు ...దొర గుమస్తావు. ఉప్పుదిన్న గురుత్వం లేకుండా ఎంగిలి కూడుకాశపడి దొరసొమ్మును పాపిష్టి కరణపోడింటికి చేరుస్తావ్?" అని చెడామడాతిట్టి ఆ దొంగతనాన్ని ఆపింది.

నిజానికి అసలు దొంగలు కరణం, రంగయ్యలనే విషయం పాఠకులకు తెలుస్తున్నదే. రచయిత్రి కూడా ఈ సమాజం ఆకలి మంటకు తట్టుకోలేని చిన్న చిన్న దొంగతనాలను బూతద్దంలో చూపిస్తూ అసలు దొంగలను పట్టించుకోవడంలేదని చెప్పదలచుకొన్నది. యథార్థానికి సమాజంలో జరుగుతున్నది కూడా అదే. బహిరంగంగా కోట్లాది రూపాయిల దొంగలను గాలికి వదిలేస్తూ...చిన్నా చితుక దొంగలను కటకటాల పాలు చేస్తున్నారు. ఆ దొంగలను వదిలేయాలని కాదు.వాళ్ళు దొంగలుగా మారడానికి గల కారణాలను తెలిసికొని వాటిని రూపుమాపే ప్రయత్నం ఏమాత్రమూ చేయడం లేదు. పైగా కొన్ని సార్లు అసలు దొంగల పక్షం వహిస్తూ ఒకటి రెండు సార్లు జైలుకు పోయిన వారిని ఇబ్బంది పెడుతున్న ఉదాహరణలు కూడా లేకపోలేదు.

ఆకలితీర్చుకోవడానికి దొంగతనం అనివార్యమైన నాగికి ముక్కుసూటితనం ,ఆత్మ గౌరవం తెగింపుతో పాటు నిజాయితీ పాలు కూడా ఎక్కువే. రాంరెడ్డి పనిలో కుదుర్చుకోగానే

**"పనిగిని అటెంక గని ముందు నాకు బువ్వ పెట్టు. ఈ సింపులు ఇడిస్తే కట్టుకోనికె మారు బట్ట లేదు. నాకో బట్టయియ్యి."** అని అడగడంలో ముక్కుసూటితనం...

**"ఇంగో మళ్ళ నన్ను దొంగనాగి గింగనాగి అంటే ఊకోను.ఎర్కేనా?"** అనడంలో ఆత్మగౌరవ భావం పట్వారీ నాగి ఆరోగ్యంగా రంగుదేలి నిగనిగ కనపడేవరకు ఆమెపై దుమ్మెత్తిపోసిన జనంలోఒకడైన పట్వారీ ఆమెతో లైంగిక వాంఛను తీర్చుకోవాలనే ఎత్తుగడతో

**"నాగమ్మా! ఓ పారి ఇంటి దిక్కు రారాదె. జర ఆసరైపోదువు. పూటకు రెండు రూపాయలు రెండు సేర్ల పోటు పెట్టిన బియ్యం కొలుస్త."** అన్న మాటకు

**"అయ్య పంతులు. దొంగనాగి దోసిళ్ళకొద్ది బుక్కుతది గాని దంచుతాది. ఏం మొకం పెట్టుకొని పిలువొచ్చినవయ్యో?** అన్న సమాధానంలో ఆ పంతులు వ్యవహారం అర్థం చేసుకున్న చురుకుదనము

**"అంత కూడు లేక మాడి సచ్చేదినమే వస్తే మా సిన్నదొర పాదాలకాడ బడి పానాలైన ఇడుస్త గని ఈ జీవి ఉండంగ కడప దాటను. పో పో ఏంముద్దుగ అడ్గొచ్చినవు? మర్శిగిట్ల మళ్ళ ఆ మాట నాల్కదాటనిచ్చేవ్?"** అన్న మాటలలో తెగింపు నిజాయితీ కొట్టవచ్చినట్లు కనబడుతున్నది.

> **"బహిరంగంగా కోట్లాది రూపాయిల దొంగలను గాలికి వదిలేస్తూ... చిన్నా చితుక దొంగలను కటకటాల పాలు చేస్తున్నారు."**

యశోదా రెడ్డి ఈ కథలో నాగి కథ ఆధారంగా సమాజ పోకడలను చాలా స్పష్టంగా వివరించింది.

తెలంగాణా నుడికారాలకు మాండలికానికి గత సంస్కృతికి సంప్రదాయాలకు చిరునామా యశోదా రెడ్డి రచనలు. కథంతా తెలంగాణా మాండలికం లోనే సాగింది.

### కథలో తెలంగాణా మాండలికాలు

**వయ్యి** -పుస్తకం
**బాగే ఆమ్**-పబ్లిక్ గార్డెన్స్ ( ఉర్దూ)
**గుర్గి**- గురిగి /మట్టితో చేసిన కుండ ఆకారంలోని అతి చిన్న పాత్ర
**ఇంగులం**-ఇంగులము/ నిప్పు
**హవాకోరి**-వాహ్యాళి/ గాలకోసం పచ్చదనం లో కాలి నడక
**నాదాని**-అవమానం
**గుట్కుమన్నాడు**- ఊపిరి మింగడం/ చనిపోవడం
**మిర్గం**- మృగశిర
**వష్టిమి**-వష్టిమయ్య/ వైష్ణవ పూజారి
**చింతపలపండ్లు**- సీతాఫలాలు
**బర్పటము**- దొడ్డు రవ్వగా చేయుట నేల శనక్కాయ /వేరు శనగ/ బుడ్డలు/ దూప దాహము
**మిత్తి**-మృత్యువు/చావు
**అలవాటుపొంట**- అలవాటు ప్రకారము
**తోడ్కెలు**- తోడ్కలు/ చర్మము
**దుడ్లు** - పైసలు
**కుచ్చపు దుడ్లు**- నాలుగు పైసలు
**మారెమ్మ**-ప్లేగు
**మారెమ్మవుట్ట**- ప్లేగు రాను
తుప్పలు- చింరవందరగా తెగినట్లు ఉండే వెంట్రుకలు
శావ / చేవ / శక్తి బలము
**దాణబుట్ట**- పశువుల తిండి ఉంచే బుట్ట.
**ఆయుదం**- ఆముదం
లేకిడితనం-తక్కువ మోతాదు కూడా కావాలని ఆశించడం

ఇటువంటి అనేక తెలంగాణా మాండలికాలను ఎన్నో వాడింది ఈమె. గంగాళంల చాప చెర్లపడ్డట్టు ...పంజరంలో ఇడిసిన చిల్కోలె వంటి ఉపమానాలను వాడింది.మొత్తంగా తెలంగాణా మాండలికం అంటే యశోదారెడ్డి అన్నంతగా ఈమె రచనలలో తెలంగాణా మాండలికం ఒదిగిపోయింది.



- తిరునగరి దేవకీ దేవి
సెల్:9949636515

---

## ఎన్నికల సందడి

ఎన్నికల గంట మ్రోగంగానే
పోరుమైదాన ప్రవేశ ద్వారాలు
భళ్ళున తెరుచుకుంటాయి
రాజకీయ పార్టీల ముంగిళ్ళలో
వసంత శోభ కళ్ళాపు వేస్తుంది
నాయకులంతా అలజడి
జడివానలో తడుస్తూ ఉంటారు.
ఎవరి ప్రతాపమెంతో
తూకమేసుకునే సమయమది
వీడిపోకుండా ఉండేందుకు
అక్రమాలను వెంటపెట్టుకుని
సామర్థ్యానికి మెరుగులు దిద్దుతారు
నిజాయితి నిప్పు కణికలు
రగిలి, రగిలి, బూడిదవుతాయి.

ప్రజల అవసరాల ఆయువును పట్టి
హామీలకు పంచ రంగులు పులిమి
తమాషాలను తలపాగాలుగా చుడతారు
తళుకు బెళుకుల పాగా సొగసుల్లో
సామాన్య ఓటర్లు చిక్కుకుంటారు
మద్యం సీసాల మాయలకి,
నోటులు చాటుగ చేసే గమ్మత్తులకి
సగటు మనుషులు
సొమ్మసిల్లి పోతారు
వీళ్ళు వేసే ఓట్లు
దేశ భవితకెలా రక్షణవుతుంది?
ఎన్నికల రంగం
మార్పును కోరతా ఉంది
ప్రక్షాళనే పర్యవసానమిపుడు
స్వార్థం బాహువుల నుండి
నా దేశానికి రక్షణ కావాలి
రాష్ట్ర పాలనలోను, దేశ పాలనలోను
ప్రవేశించే వాడికి
అర్హతలంటూ ఉండటం
అనివార్యమైన అవసరమేమొ!
సమాధానం కోసం
మేధావుల ముందుంచుతున్న
ప్రశ్న ఇది!



-ఎస్.ఆర్. పృథ్వీ
సెల్:9989223245

## మట్టి మనిషి ఆక్రందన

భూమి తల్లిని చదును చేసి
హరిత వర్ణ అచ్చాదనదద్ది
సస్య కేదారాలను సృష్టించే రైతు .
నేడు ప్రకృతి ప్రకోపాలకు తలొగ్గి,
ఋతువుల జూదాలకు పావై,
మార్కెట్ దోబూచులకు మౌనంగా
వధ్యసిలపై తల వాల్చేస్తున్నాడు .
కంప్యూటర్లతో తలపండి పోయినా
పేటియం ఏటీయంలతో
బ్యాంకు మొకంచూడక పోయినా,
ఫేస్బుక్, వాట్స్ ఆప్‌లతో చాటింగ్ చేస్తున్నా
నృసింహ శతకం చెప్పినట్లు
లక్షాధికారైన లవణ మన్నమే తింటాడు .
ఆ పిడికెడు మెతుకులు ఇచ్చే రైతు
కొనుగోలూ, అమ్మకాల మోసం త్రాసులో
ఊగులాడుతూ ఉంటే
పిడికెడు మెతుకులు దొరికే దారెక్కడ...?
తనపంటకు ధర నిర్ణయించేసే
వ్యవస్థ మాయా జాలంలో చిక్కుకొని
తన వాంగ్మూలాన్ని తనే రాసుకొంటాడు.
కొడుకు చదవుల కాసరా రానిపంట
కూతురు పెళ్లికి ఆసరా రానిపంట
అవసరాలన్నీ తీరాకప్పుడొస్తుంది
అనుకోని అతిథిలా
తరాలుగా మట్టివాసన పీలుస్తూ
మట్టి తడి బందాల్లో మునకలేాతూ
మేడి పట్టుకొన్న రైతు
ఇవాళ కాడి పడేసి ఉరికొయ్యను ముద్దాడ బోతుంటే
బాధ్యత పట్టని యంత్రాంగం
రోమ్ తగలబడినప్పుడు ఫిడేలు వాయించిన
నీరో అవుతుంది.
మనమంతా ఇప్పుడు రైతు పాటే పాడాలి.
వాడి స్వావ లంబన కోసం
వ్యవస్థను నిలదీయాలి.



-ఆవుల వెంకట రమణ
9494088110

## పిలుస్తోంది ...మన బడి

ప్రభుత్వ బడి పిలుస్తోంది
గణ గణ మను గంటలతో
ప్రార్థనా గీతాలాపనలతో.

ప్రభుత్వ బడి పిలుస్తోంది
హాయి గొల్పు ఆటలతో
చైతన్యం నింపు పాటలతో.

ప్రభుత్వ బడి పిలుస్తోంది
సృజనాత్మక చిత్రాలతో
అభినయ గేయాలతో.

ప్రభుత్వ బడి పిలుస్తోంది
ప్రేమను పంచు గురువులతో
ఆహ్లాదం పెంచు తరువులతో

ప్రభుత్వ బడి పిలుస్తోంది
విశాలమైన గదులతో
విజ్ఞాన గనుల గోడలతో.

ప్రభుత్వ బడి పిలుస్తోంది
శుచికరమైన వంట శాలతో
రుచికరమైన మధ్యాహ్న బువ్వతో.

ప్రభుత్వ బడి పిలుస్తోంది
విలువలతో కూడిన విద్యతో
ఉచిత పాఠ్యపుస్తకాలతో.

ప్రభుత్వ బడి పిలుస్తోంది
ఉచిత సమ వస్త్రాలతో
రుసుములు లేని శిక్షణతో.

ప్రభుత్వ బడి పిలుస్తోంది
ఆధ్యాత్మికమైన ధ్యానంతో
ఆరోగ్యకరమైన యోగాలతో

ప్రభుత్వ బడి పిలుస్తోంది
గ్రంథాలయాల కథలతో
నాటకీయ పాత్రలతో

ప్రభుత్వ బడి పిలుస్తోంది
విహార యాత్రలతో
విజ్ఞాన క్షేత్రాలతో



-కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

## మరుగుజ్జులు

చూస్తూ చూస్తూనే ప్రపంచం మారిపోతుంది
ప్రపంచంలోని మనుషులంతా
ఆధునికత వైపు అడుగులేస్తున్నా
వారంతా మరుగుజ్జులే అనిపిస్తోంది
భౌతిక అభివృద్ధి ఆకాశమంత కనబడుతున్న
నైతిక అభివృద్ధి నానాటికి పాతాళం చేరుతోంది
అందుకే మనుషులు
మరుగుజ్జులు అయిపోతున్నరు
మరుగుజ్జులు అంటే
ఎత్తు వెడల్పు వంటి ఆకారంలోన
సంస్కారంలో:హృదయ వైశాల్యంలో
మనుషులంతా మరుగుజ్జులే
చూస్తుండగానే
ఈర్ష్య ద్వేషాలు వటవృక్షాలై ఎదుగుతున్నాయి
స్వార్థం సంకుచితాలు వరదలై పొంగుతున్నయి
వయసులో ఎదుగుతున్నరు
చదువుల్లో ముందుకెళ్తున్నరు
అయినా మనుషులంతా మరుగుజ్జులే
హృదయ మరుగుజ్జులతో
ఈ ప్రపంచం నిండిపోతుంది
అసలు
అవిటితనం ఏంటో తెలుసా
హృదయపు మరుగుజ్జుతనం..



- సాకి,
9951172002.

## జాతీయ కవి సుద్దాల అశోక్‌తేజ జ్ఞానపీఠ అవార్డుకు అర్హులు



జాతీయ కవి సుద్దాల అశోక్‌తేజకు జ్ఞానపీఠ అవార్డుకు అర్హులని సిబిఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ జేడీ. లక్ష్మీనారాయణ అన్నారు. ఈ అవార్డు రావాలని ప్రతి ఒక్కరు ఆకాంక్షను వ్యక్తం చేయాలన్నారు. వంశీ ఇంటర్నేషనల్ సహకారంతో, శ్రీ శారద మ్యూజిక్ అకాడమీ అధినేత్రి, గాయని శారద సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ కవి, ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజకు **'ఎస్.పి. బాలు-శారద మ్యూజిక్ అకాడమీ, జీవిత సాఫల్య పురస్కారం-2023'** ప్రదానోత్సవం సభ వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు నిర్వహణలో, ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు అధ్యక్షతన జులై 21, శుక్రవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జేడీ. లక్ష్మీనారాయణ పురస్కారాన్ని ప్రదానం చేసి ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాట కవియోధుడు సుద్దాల హనుమంతు వారసుడిగా ఆయన భావాలను అశోక్‌తేజ అందిపుచ్చుకున్నారని అన్నారు. వంశీ రామరాజు మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం, అశోక్‌తేజ తొలిరోజుల్లో వంశీ పురస్కారాలు అందుకున్నారని అన్నారు. ఆత్మీయ అతిథులుగా శతాధిక చిత్రనిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సంగీత నృత్యగురువు, ఆధ్యాత్మికవేత్త బికె. అపర్ణ, యువగాయకులు మహేష్, ఉదయ్‌కుమార్, నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'నేలమ్మ.. నేలమ్మ..నేలమ్మ.. నీకు వేల వేల వందనాలమ్మా' పేరుతో తెలుగు-హిందీ సినీ సంగీత విభావరి గాయని శారద సమర్పణలో సాగింది. గాయనీ గాయకులు లక్ష్మీపద్మజ, అచ్యుత, రామ్‌కుమార్, సూర్య, ఎస్.ఏ. పద్మ, నర్మద, నాగేంద్ర, ప్రదీప్‌చంద్ర, పవిత్ర, నందకిశోర్, శంకరయ్య, బాలకృష్ణ తదితరులు అద్భుతంగా సాగింది. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఎంఎల్ఎన్.స్వామి వ్యవహరించారు.

## ఆకలి కథ

రామయ్య తన ఎద్దులతో వ్యవసాయం చేసేవాడు. అతడు ఒకసారి పొలం దున్నడానికి తన ఎద్దులను తోలుకొని వెళ్ళాడు . కానీ ఆ ఎద్దులు కొద్దిసేపు పని చేసిన తర్వాత అవి మొరాయించాయి. రామయ్యకు చాలా ఆశ్చర్యం అనిపించింది . ఎప్పుడూ తను అనుకున్న పని పూర్తి చేసే ఆ ఎద్దులు ఆరోజు అలా ఎందుకు మొరాయిస్తున్నాయని ఆలోచించాడు . చివరకు తన పనిని ఆపి మధ్యాహ్నం వేళ ఇంటికి వచ్చాడు. ఆ తర్వాత కోపంతో వాటికి మధ్యాహ్నం మేతను కూడా వేయలేదు.

ఉదయం పొరుగూరు వెళ్లిన అతని భార్య మధ్యాహ్నం తిరిగి వచ్చి "ఇంత తొందరగా పొలం నుండి వచ్చారేమిటండి "అని ప్రశ్నించింది. " ఈ ఎద్దులు రానుపోను సోమరిపోతులు అవుతున్నాయే! మధ్యలో పని మానివేసి మొరాయించాయి " అని అన్నాడు . అప్పుడు ఆమె " ఓహో !అలాగా ! మీరు వాటికి ఈ రోజు ఉదయం,మధ్యాహ్నం మేతను వేశారా !"అని అడిగింది. అతని భార్య " లేదే ! నేను వాటిపై కోపంతో మధ్యాహ్నం మేతను వేయలేదు. ఉదయం నీవు వాటికి మేతను వేయలేదా ఏమిటి? అయినా నీవే రోజు వాటికి మేతను వేస్తున్నావు కదా! నీవు మేతను వేయలేదా ఏమిటి ?"అని అన్నాడు . అప్పుడు ఆమె" అయ్యో! మీకు మతిమరుపు ఎక్కువైంది. నేను మిమ్మల్ని రెండు రోజుల నుండి వాటికి మేతను మిమ్మల్నే వేయమన్నానండి. మీరే వేశారని నేను అనుకున్నాను. వాటికి పాపం రెండు,మూడు రోజులుగా తిండి లేదు. వాటికి ఆకలి అవుతుండవచ్చు . మనకు భోజనం లేకుంటే మనం పనిని చేస్తామా చెప్పండి . అవి కూడా అంతే . ఉదయం వాటికి మేతను నేను వేయలేదు. మీరూ వేయలేదు. అవి పని చేయలేదంటూ మీరు మధ్యాహ్నం కూడా వాటికి మేత వేయలేదు. పాపం మూగ ప్రాణులు . ఇప్పటికైనా వాటికి మేతను వేయండి. వాటిపై కోపం తగదు "అని అంది.

అది విన్న రామయ్య "అయ్యో! ఎంత పని చేశావే! నీవు ,నేను ఇద్దరం వాటికి మేతను మరిచిపోయాము. ఇవి ఎందుకు పనిచేయడం లేదని నేను హడలి చచ్చాను " అని వెంటనే మేతను తెచ్చి వేశాడు. ఆ పశువులు ఆవురావూరు మంటూ ఆ మేతను తిన్నాయి . మరునాడు అవి చాలా ఉత్సాహంగా పనిచేయడం చూసిన రామయ్య "తప్పు నా దగ్గర పెట్టుకొని పాపం వాటిని అనవసరంగా మేత వేయకుండా శిక్షించాను" అని బాధపడ్డాడు. మరెన్నడూ కూడా రామయ్య, ఆయన భార్య వాటికి మేతను మరచిపోలేదు.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

